ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

మంగళవారం 13 మే 2025 | 5



అమలాపురం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 36 (సోమవారం)

కనిష్ఠం : 29



ఈదరపల్లి వద్ద వంతెన పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, ఎంపీ హరీష్‌మాధుర్

ఈదరపల్లి వంతెన పనులకు శంకుస్థాపన

ఎమ్మెల్యే, ఎంపీ, ఇతర నేతలు హాజరు

అమలాపురం, మే12(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణాభివృద్ధికి అవిశ్రాంత కృషిచేయనున్నట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం పట్టణంలోని ప్రధాన పంటకాల్వపై ఈదరపల్లి వద్ద రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కొత్త వంతెన నిర్మాణానికి ఎంపీ హరీష్‌మాధుర్‌తో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో పెరుగుతున్న రద్దీని నియంత్రించడానికి వీలుగా పలుచోట్ల వంతెనల నిర్మాణాలు ఆవశ్యకత ఎంతైనా ఉందని, రాగల రోజుల్లో మరో రెండు వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరుచేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా రోడ్ల విస్తరణకు కూడా భారీగా నిధులు అవసరం అవుతున్న దృష్ట్యా వాటిని విస్తరించి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధి విషయంలో తాను అంకితభావంతో పనిచేస్తానని, నిధులు మంజూరుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి వాటిని సాధిస్తానని హామీ ఇచ్చారు. పెరుగుతున్న అవసరాల దృష్ట్యా పట్టణాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఆర్డీవో కె.మాధవి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, డీసీఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, టీడీపీ నాయకులు బొర్రా ఈశ్వరరావు, బోనం సత్యవరప్రసాద్, పొలమూరి ధర్మపాల్, మట్టా మహలక్ష్మిప్రభాకర్, జంగా అబ్బాయివెంకన్న, కర్రి రామస్వామి, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, కిసాన్‌మోర్చా జాతీయనేత నల్లా పవన్‌కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, కొప్పుల నాగమానస, అధికారి బాబ్జి, నల్లా చిట్టిబాబు, భాస్కర్ల రామకృష్ణతో పాటు పలువురు ఇంజనీరింగ్ అధికారులు, కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి రోడ్ల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో ప్రజాప్రతినిధులు మాట్లాడారు.



వన్‌స్టాప్ సెంటర్ సిబ్బందికి నియామక పత్రాలను అందించిన జేసీ నిషాంతి

వన్‌స్టాప్ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి : జేసీ

కొత్తపేట, మే 12(ఆంధ్రజ్యోతి): వన్‌స్టాప్ సెంటర్లో నియమితులైన ఉద్యోగులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. సోమవారం కొత్తపేట ఆర్డీవో కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ విధానంపై నియమితులైన 18 మంది వన్‌స్టాప్ సిబ్బందికి నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా జేసీ నిషాంతి మాట్లాడుతూ మహిళా శిశుఅభివృద్ధి, కేంద్ర మంత్రిత్వశాఖ నేతృత్వంలో పనిచేసే ఈ వన్‌స్టాప్ సెంటర్ ఒంటరి మహిళలకు కోసమని, లైంగిక వేధింపులు, లైంగిక దాడి, గృహహింస, అక్రమ రవాణా, పరువు హత్యల బాధితులు, యాసిడ్ దాడులకు గురైన మహిళలకు ప్రత్యేక సేవలు అందించబడతాయన్నారు. బాధిత మహిళలకు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో సహాయం, మానసిక, సాంఘిక మద్దతు, కౌన్సెలింగ్ వంటి సహకారం అందిస్తారన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో పి.శ్రీకర్, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, సీడీపీవోలు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే రికవరీ చేస్తాం

- ప్రతి రహదారిని సూక్ష్మస్థాయిలో పరిశీలిస్తాం
- ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ సీఈ జి.వెంకటేశ్వరరావు 8

వేడుకగా సత్యదేవుడి చక్రస్నానం 7

ద్రాక్షారామలో సీఎంవో కార్యదర్శి పూజలు



టెంపుల్‌గా.. పెట్టండి!

భక్తజన..భోజనంబు!

తిరుపతిలో తినలేకపోతున్నాం.. గత ప్రభుత్వంలో ఇదీ భక్తుల మాట.. ప్రభుత్వం మారింది.. అంతే అన్నదానం అమృతమయంగా మారింది. సీఎం చంద్రబాబు నాయుడు తిరుపతిలో అన్నదాన ప్రసాదాన్ని అమోఘంగా మార్చారు. నాణ్యతగా ఉండేలా చూస్తున్నారు.. ఒక్క తిరుపతిలోనే కాదు.. జిల్లాల్లోని ప్రధాన ఆలయాల్లోనూ నిత్యాన్నదానం చేయాలని తలంచారు.. దీనిలో భాగంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు ఆలయాల్లో నిత్యాన్నదానం చేయాలని ఆదేశించారు. అందులో ఒకటి అన్నవరం.. రెండోది వాడపల్లి. అలాగే తలుపులమ్మ లోవ ఆలయంపై నివేదికివ్వాలని సూచించారు. సీఎం ఆదేశాల అమలుకు అధికారులు పరుగులు పెడుతున్నారు.



భక్తుల కడుపు నింపండి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నవరం, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాలకు ఉభ య తెలుగు రాష్ట్రాల నుంచి వేలల్లో భక్తులు వస్తుంటారు. ఏటా కోట్లలో విరాళాలు అందు తున్నాయి. ప్రస్తుతం అన్నవరం,వాడపల్లి ఆల యాలకు వేలాదిగా వచ్చే భక్తులకు ఉచిత అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు.అన్నవరం కొండపై నిత్యం నాలుగు వేల మంది భక్తులకు నిత్యాన్నదానం అమలవుతోంది. వాడపల్లిలో శని,ఆదివారాల్లో 50 వేల వరకు, మిగిలిన రోజు ల్లో 10 వేల మంది వరకు భక్తులకు అన్నదానం అందుతోంది. ఈ రెండు ఆలయాలకు కొన్నేళ్లుగా భారీగా భక్తులు తరలివస్తోన్న నేపథ్యంలో మరింత మందికి పరిమితిలేని విధంగా అన్న దానం అందించాలని సీఎం చంద్రబాబు అధికా రులను ఆదే శించారు.ఈ నెల 6న అన్ని ఆలయాల ఈవోలతో అమరా వతిలో సమీక్షించిన సీఎం భక్తులకు ఇబ్బందిలేకుండా అన్న దానం అమలు చేయాలని ఆదేశించారు. దీంతో ఈ రెండు ఆలయాల్లో భక్తులకు మరింత మందికి అన్న ప్రసాదం అందనుంది.

- సీఎం చంద్రబాబు ఆదేశాలు
- అన్నవరం, వాడపల్లిలో అమలు
- ఇప్పటికే వేలాదిమందికి అన్నదానం
- మరింత పెంచేందుకు సన్నాహాలు
- అన్నవరంలో నిధుల కొరత
- వాడపల్లిలో అన్నదానానికి ఓకే
- తలుపులమ్మ లోవపై నివేదిక
- 17న అమరావతిలో సమీక్ష

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నవరం, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులకు పరిమితి లేకుండా నిత్యాన్నదానం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భక్తులు ఎంతమంది వచ్చినా అందరికీ కడుపునిండా భోజనం వడ్డించాలని నిర్ణయించింది. ఈమేరకు సీఎం చంద్రబాబు ఇటీవల దేవదాయశాఖపై సమీక్ష సందర్భంగా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం ఈ రెండు ఆలయాల్లో నిరంతరం భక్తులకు నిత్యాన్నదానం అందుతున్నా ఇకపై మరింతమందికి భోజనం అందించేందుకు అధికారులు కసరత్తు ఆరంభించారు. అన్నవరం దేవస్థానానికి నిధుల కొరత వేధిస్తుండడం, భోజనశాలలు ఏమాత్రం సరిపోకపోవడంతో దీన్ని ఎలా అమలుచేయాలనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. వాడపల్లికి నిధులు పుష్కలంగా ఉండడంతో పరిమితి లేకుండా మరింత మందికి అన్నదానం అమలుచేయనున్నారు. తుని నియోజవర్గంలోని తలుపులమ్మ లోవ ఆలయంలో నిత్యాన్నదానం అసలు ఇంతవరకు లేదు. దీంతో త్వరలో అమలుకు వీలుగా సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వం నివేదిక కోరింది.

అన్నవరంలో తర్జనభర్జన..

సీఎం ఆదేశాలను తక్షణం అమలుచేసే విషయంలో అన్నవరం దేవస్థానం అధికారులు తలపట్టుకుంటున్నారు. అన్నప్రసాదం సంఖ్య పెరిగితే ఆర్థిక భారం ఎలా మోయాలనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. 1987లో సత్యదేవా నిత్యన్నదాన ట్రస్ట్ ఏర్పాటుచేశారు. ఈ ట్రస్ట్‌లో రూ.64 కోట్లు ఫిక్సిడ్ డిపాజిట్లు ఉన్నాయి. వీటిపై ఏటా రూ.4.5 కోట్లు వడ్డీ లభిస్తోంది. సాధారణ రోజుల్లో నాలుగు వేలు, శని, ఆదివారాల్లో 5 వేల నుంచి 6 వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు. వడ్డన సిబ్బంది జీతభత్యాలతో కలిపితే ఒక్కో భోజనానికి దేవస్థానానికి రూ.34 వ్యయమవుతోంది. కార్తీకమాసం వంటి పుణ్యమాసాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత పులిహోర, దద్దోజన ప్రసాదాన్ని అందిస్తున్నారు. వీటి నిర్వహణకు ప్రస్తుతం లభిస్తున్న వడ్డీ డబ్బులు చాలీచాలనట్టుగా ఉన్నాయి. సీఎం చంద్రబాబుతో ప్రకటనతో పరిమితిలేని నిత్యాన్నదానం ఎలా అమలుచేయాలనేదానిపై ఆలయ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. అన్నవరంలో నిర్విరామంగా అన్నప్రసాద వితరణ చేయాలంటే సుమారు రోజుకు



10 వేల మందికి అందించాల్సి ఉంటుంది. పైగా దేవస్థానంలో ప్రస్తుతం ఉన్న భోజన హాలు చిన్నగా ఉంది. దీంతో నూతన అన్నప్రసాద భవననిర్మాణం ప్రసాద్ స్కీంలో రూ.11.50 కోట్లతో మంజూరైంది. తీరా పనులు దక్కించుకున్న కాంట్రాక్టరే సింహాచలం ఘటనలో నాసిరకం పనులతో దొరికిపోవడంతో ప్రభుత్వం అతడిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. దీంతో అన్నవరం ప్రసాద్ స్కీం పనులు ఆగిపోయే పరిస్థితి తలెత్తింది. ఖర్చులన్నీ దేవదాయశాఖ మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని అక్కడనుంచి వచ్చే ఆదేశాలకనుగుణంగా వ్యవహరిస్తామన్నారు.

వాడపల్లిలో ఓకే..

కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి గడచిన కొన్నేళ్లుగా వేలల్లో భక్తులు పోటెత్తుతున్నారు. ఈమేరకు ఆల యంలో నిత్యాన్నదానం అమలు చేస్తున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో అపరిమిత అన్నదానం అమలు చేయాలని సీఎం సూచించారు. ఈ నేపథ్యంలో దీనికి తగ్గ సన్నాహాలను అధికారులు ఆరంభించారు. తుని నియోజకవర్గంలోని తలుపులమ్మ ఆలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఆలయ రద్దీ లెక్కలు సీఎం సమీక్షలో అధికారులు ప్రస్తావించారు. ఇక్కడ కూడా అన్నదానం అమలు చేయాల్సిన అవసరాన్ని సీఎం ప్రస్తావించారు. ఈ ఆలయంలో అసలు అన్నదానం అమలు కావడం లేదు. అన్నదానం అమలు సాధ్యాసాధ్యాలపై తలుపులమ్మ ఆలయ ఈవోను ప్రభుత్వం నివేదిక కోరింది. ఇక్కడకు ఆదివారం 10 వేల మంది వరకు భక్తులు వస్తారని.. మిగిలిన రోజుల్లో వెయ్యి మంది వరకు ఉంటారని అధికారులు ప్రభుత్వానికి పంపిన నివేదికలో పేర్కొన్నారు. పైగా ఈ ఆలయానికి వచ్చే భక్తులు సొంతంగా ఇక్కడే వండుకుని తినే ఏర్పాట్లతో వస్తారని.. అన్నదానం అవశ్యకత తక్కువేనని తెలిపారు. అయితే లోవలో అన్నదానం అమలు చేయాలా? లేదా? అనేదానిపై ఈనెల 17న అమరావతిలో జరగనున్న సమీక్షలో స్పష్టత రానుంది. ఆలయాల్లో భక్తులకు అందుతున్న సేవలు, భోజన నాణ్యతపై తరచుగా ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాలు సేకరిస్తోంది. ఏ మాత్రం నాణ్యతలో తేడా ఉందని ఫిర్యాదులు వచ్చినా ఆలయానికి ఇచ్చే పాయింట్లను తగ్గిస్తూ అధికారులను పరుగులు పెట్టిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారాక అనేక ఆలయాల్లో అన్న ప్రసాదంలో నాణ్యత రెట్టింపుకావడంతో భక్తులు ఆనందిస్తున్నారు.



జిల్లా కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ నిర్వహిస్తున్న డీఆర్వో రాజకుమారి

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 215 ఫిర్యాదులు

డీఆర్వో ఆధ్వర్యంలో వినతుల స్వీకరణ

అమలాపురం టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదులను సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఎటువంటి జాప్యం లేకుండా చూడాలని జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం అమలాపురంలోని కలెక్టరేట్ గోదావరి భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్‌ను నిర్వహించారు. డీఆర్వోతోపాటు డ్వామా పీడీ మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి, జీఎస్‌డబ్ల్యుఎస్ ఇన్‌చార్జి, నోడల్ అధికారి ఎస్టీవీ రాజేశ్వరరావు, కలెక్టరేట్ ఏవో విశ్వేశ్వరరావు అర్జీదారుల నుంచి సుమారు 215 ఫిర్యాదులను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా అధికారులంతా ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కార మార్గాలు చూడాలని కోరారు. క్షేత్రస్థాయిలో ప్రతీ ఫిర్యాదుదారుని వద్దకు వెళ్లి వారి సమక్షంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డీఆర్వో ఆదేశించారు. మండల, డివిజన్ స్థాయిలో గ్రీవెన్స్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు జిల్లా కేంద్రానికే రావాల్సిన అవసరం లేకుండా ఆయా ప్రాంతాల్లో ఫిర్యాదులు ఇవ్వవచ్చని కోరారు. సమగ్రశిక్ష ఏపీసీడీ మమ్మీ, వ్యవసాయాధికారి బోసుబాబు, డీసీహెచ్ఎస్ కార్తీక్, డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గారావుదొర, డీపీవో శాంతలక్ష్మి, పీఆర్ఎస్ఈ రామకృష్ణారెడ్డి, సివిల్ సప్లయిస్ అధికారి ఉదయభాస్కర్ పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

ఎస్పీ కార్యాలయంలో..

అమలాపురం, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ కృష్ణారావు స్వయంగా స్వీకరించి వారిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని చట్ట పరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలని పోలీసులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయంచేయాలని ఆదేశించారు. వాటిని జిల్లా ఎస్పీ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపాలని కోరారు.



మండు గడ్డి!

ఎండు గడ్డికి యమ డిమాండ్

- ఎకరం రూ.8 వేలు
- యంత్రాలతో కోత
- ముక్కలైపోతున్న గడ్డి
- అయినా దిగిరాని ధర
- గడ్డి రోలింగ్..
- పాడి రైతు లబోదిబో



పి.గన్నవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): వరికోత యంత్రాలు అందుబాటులోకి వచ్చిన తరువాత ఎండుగడ్డికి రెక్కలొచ్చాయి. కూలీలు కొరత వేధిస్తున్న దృష్ట్యా ప్రస్తుతం అన్నదాతలు యాంత్రీకరణ వైపే చూస్తున్నారు. పాత పద్ధతిలో కోతలు కోస్తే గింజ రాశిపైకి రావడానికి సుమారు రెండు రోజులు పట్టేది. వాతావరణం అనుకూలించకపోతే మరి కాస్త జాప్యం జరిగేది.ఈ ఇబ్బందులకు స్వస్తి పలికేందుకు యాంత్రీకరణ వైపే రైతులు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఎండుగడ్డికి కొరత వచ్చింది. యంత్రాల ద్వారా వరికోతల కారణంగా గడ్డి ముక్కలైపోతుంది.ఆ గడ్డి తినేందుకు పశువుల ఇష్టపడవు. అయినా చేసేది లేక రైతులు ఆ గడ్డినే ఒబ్బిడి చేసుకుని ఏడాది పాటు వినియోగిస్తు న్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గేదెలు 1.06 లక్షలు, ఆవులు 55 వేలు ఉన్నట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

ఎకరానికి 70 రోల్స్

మొదటి పంట పూర్తిగా వర్షాకాలంలో రావడంతో ఆ సమయంలో గడ్డి అక్కరకు రావడం లేదు. దీంతో రెండో పంటలో వచ్చే ఎండుగడ్డికి తీవ్ర డిమాండ్ పెరిగిపోతోంది. ప్రత్యేకంగా తయారు చేసిన యంత్రపరికరం ద్వారా ఒక ఎకరానికి సుమారు 70 నుంచి 100 రోల్స్‌ని చుడుతున్నారు.ఒక ఎకరం గడ్డిని చుట్టుకునేందుకు కొనుగోలు చేయడానికి సుమారు రూ.2500 నుంచి రూ.3 వేల వరకు రైతులు తీసుకుంటున్నారని రైతులు చెబుతున్నారు. వీటిని చుట్టే యంత్రానికి కట్టకు రూ.30 నుంచి రూ.40ల వరకు చెల్లించాల్సి ఉంది.ఈ క్రమంలో ఒక ఎకరం గడ్డి చుట్టి తీసుకురా వాలంటే పాడి రైతుకు దాదాపుగా రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చవుతుంది.గడ్డి మేటు మాదిరిగా ఈ రోల్స్‌ను ఆరుబయట ఉంచడం కుదరదు. వీటిని ఒకదానిపై ఒకటి అమర్చి వర్షంలో తడవకుండా రక్షణ ఏర్పాటు చేసుకోవాలి.వర్షంలో తడిస్తే ఆ రోల్స్ పనికి రావని కుళ్లి పోతాయని పాడి రైతులు చెబుతున్నారు. కొంత మంది మధ్యవర్తులు రైతుల వద్ద గడ్డిని కొనుగోలు చేసి రోల్స్‌గా తయారు చేసిన అనంతరం పాడిరైతుకు రూ.100 నుంచి రూ110లకు విక్రయిస్తున్నారు.మరి కొంత మంది మధ్య వర్తులు తయారు చేసిన రోల్స్‌ను వారి వద్దే స్టోర్ చేసి వర్షకాలం, వరదల సమయంలో పాడి రైతులకు సుమారు రూ.150 నుంచి రూ.300 విక్రయిస్తున్నారు. వరదల సమయం లో లంకప్రాంతాల్లో పచ్చికబయళ్ల పూర్తిగా ధ్వంసం కావడంతో ఈ ఎండుగడ్డి రోల్స్‌కు భలేడిమాండ్ ఉంటుంది.గతంలో అయితే వరికోత యంత్రం కోత పూర్తి చేసిన తరువాత ఆ గడ్డిని ఒబ్బిడి చేసుకుని తమ కమతంలతో గడ్డిమేటుగా వేసుకునే వారు. ప్రస్తుత కాలంలో గడ్డిమేటుకు సైతం స్వస్తి పలికి రోల్స్ వైపు మొగ్గు చూపుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిర్ల జగ్గిరెడ్డి

వైసీపీ నాయకుల ఆందోళన

అమలాపురం టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కుట్టు శిక్షణల పేరుతో చేస్తున్న స్కామ్‌పై విచారణ జరపాలని జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు. అమలాపురంలోని గడియార స్తంభం సెంటర్‌లో జిల్లా వైసీపీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన, బహిరంగ సభ నిర్వహించారు. సెంటర్‌లో రెండు కుట్టుమిషన్లు పెట్టి ప్రభుత్వం భారీగా స్కామ్‌లకు పాల్పడుతుందంటూ తీవ్రస్థాయిలో ఆరోపణాస్త్రాలు సంధించారు. కుట్టు శిక్షణల పేరుతో మహిళలను మోసం చేస్తున్న ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. కూటమి ప్రభుత్వం తీరు మారాలని.. ప్రజా సంక్షేమం దిశగా పాలన సాగించాలని డిమాండ్ చేశారు. రెండు కుట్టు మిషన్లతోఎంత మందికి శిక్షణ ఇస్తారని ప్రశ్నించారు. బహిరంగ సభ అనంతరం ర్యాలీగా వెళ్లి గాంధీ విగ్రహానికి పూలమాలలువేశారు.పాకిస్తాన్ కాల్పుల్లో వీరమరణం పొందిన సైనికుడు మురళీనాయక్ చిత్రపటానికి వైసీపీ నేతలు పూలమాలలువేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎంపీ చింతా అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పొలంలోనే ఎరువుల తయారీ

పీఎండీఎస్‌ను ప్రోత్సహిస్తున్న వ్యవసాయ శాఖ 6





పొగ మంచు కురిసె..


పగలు మండే ఎండలు మంటపుట్టిస్తుంటే.. సాయంత్రం ఆకస్మికంగా వాన వచ్చేస్తోంది. ఈ విచిత్ర వాతావరణంతో జనం రకరకాల పాట్లు పడుతున్నారు. దీనికితోడు వేకువజామున పొగమంచు కురుస్తూ మూడు కాలాలను ఒకేసారి అనుభవంలోకి తెస్తోంది. మండపేట పట్టణంలో పంటపొలాలపై సోమవారం తెల్లవారుజామున కనిపించిన పొగమంచు దృశ్యాలివి.. - మండపేట

‘నీళ్లా’కాశంలో..



సీప్లేన్(ఫైల్‌ఫొటో)

- త్వరలో సీప్లేన్‌లో రయ్.. రయ్
- వాటర్ ఏరో డ్రోమ్‌ల ఏర్పాటుకు కసరత్తు
- సముద్ర, నది, కాలువలకు అనుసంధానంగా రవాణా
- కాకినాడ - కోనసీమ ప్రాంతాల మధ్య రాకపోకలు
- ప్రభుత్వానికి రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ ప్రతిపాదన



కాకినాడ బీచ్‌లో సందడి



బీచ్‌లో ప్యారాచూట్‌తో విన్యాసాలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఏపీ టూరిజం ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో త్వరలో సీప్లేన్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే విజయవాడ -శ్రీశైలం మధ్య ఈ సర్వీసులు ప్రారంభంకాగా.. మరికొన్ని రోజుల్లో కాకినాడ-కోనసీమ జిల్లాల్లోనూ ఈ తరహా సీ ప్లేన్‌లను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు తీసుకొస్తున్నారు. దీనిద్వారా నీటిలోనే ప్రయాణం సాగనుంది. తక్కువ సమయంలోనే నిర్ణీత గమ్యానికి చేరుకోవచ్చు. నాలుగేళ్ల కిందట గుజరాత్‌లో ఈ సీప్లేన్ సర్వీసులను ప్రారంభించారు. అలాగే ఆమధ్య విజయవాడ కృష్ణా నది నుంచి శ్రీశైలం వరకు కూడా సీ ప్లేన్ నడిపారు. పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను కలిపేలా రాష్ట్రంలోని 8 ప్రాంతాల్లో వాటర్ ఏరోడ్రోమ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిపాదించింది. అరకు నుంచి తిరుపతి వరకు ప్రతిపాదించిన 8 ప్రాంతాల మధ్య సీ ప్లేన్‌లు నడిపేలా రూట్లను ప్రతిపాదించింది. డీపీఆర్‌లు తయారుచేసి కేంద్ర విమానయానశాఖకు పంపనున్నారు. వాటిని పరిశీలించి, ఆమోదించిన లొకేషన్లలో వాటర్ డ్రోమ్‌లను కేంద్రం అభివృద్ధి చేయనుంది. ఈనేపథ్యంలో సీప్లేన్ నడిపేందుకు కొన్ని ప్రాంతాలను ఎంపిక చేశారు. ముఖ్యంగా సముద్ర, నదీతీర ప్రాంతాలతోపాటు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను ఎంచుకున్నారు. అరకు నుంచి తిరుపతి వరకు ఈ ప్లేన్‌లు తిరిగేలా రూట్ మ్యాప్‌ను కూడా సిద్ధంచేశారు. అరకు-లంబసింగి, లంబసింగి-రుషికొండ, రుషికొండ-కాకినాడ, కాకినాడ-కోనసీమ, కోనసీమ-విజయవాడ, విజయవాడ-శ్రీశైలం, శ్రీశైలం-తిరుపతి మధ్య సీప్లేన్‌ను నడిపే ఆలోచనలో ఉన్నారు. ఇక మన ఉమ్మడి తూర్పుగోదారి జిల్లాలోని కాకినాడ సాగరతీరం నుంచి.. కోనసీమలో గోదావరి బ్యాక్ వాటర్ నిల్వ చేసే చోట ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

కాకినాడ తీరం.. టూరిజం హబ్..

ఇప్పటికే కాకినాడ సాగరతీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసే పనులు పెద్దఎత్తున సాగుతున్నాయి. మరోవైపు పర్యాటకుల సంఖ్య కూడా విపరీతంగా పెరుగుతోంది. ప్రస్తుతం వేసవి సెలవులు నేపథ్యంలో పర్యాటకులు ఎక్కువగా వస్తున్నారు. వీరికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందంగా గడిపేలా పలు సౌకర్యాలు కల్పిస్తున్నారు. సెలవుల్లోను, వారాంతాల్లోను పేరాచ్యూట్ వంటివి ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. ఎమ్యూజ్‌మెంట్ పార్కులు ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటకులకు పూర్తిస్థాయి వినోదాన్నిచ్చే అనేక పనులు అక్కడ జరుగుతున్నాయి. సమీపంలోనే కొత్తగా రిసార్ట్స్ కూడా ఏర్పాటవుతున్నాయి. మరో ఏడాది దాటితే మొత్తం కాకినాడ సాగరతీరం పూర్తిగా టూరిస్టుల హబ్‌గా మారనుంది. ఇక పచ్చని సీమగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాలోని తీర ప్రాంతాలకు కూడా ఇప్పటికే పర్యాటకుల తాకిడి అధికంగా కనిపిస్తోంది. గోదావరి తీరాన ఆధ్యాత్మికంగాను ఆ ప్రాంతం అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ నేపథ్యంలో కాకినాడ సాగరతీరం నుంచి కోనసీమకు సీప్లేన్ అందుబాటులోకి వస్తే.. రెండు జిల్లాల వాసులకు మధ్య దూరం ఇంకాస్త దగ్గర కానుంది.

కాకినాడ నుంచి రుషికొండ బీచ్‌కు..

మరోవైపు కాకినాడ సాగర తీరం నుంచి విశాఖ సమీపంలోని రుషికొండ బీచ్‌కు కూడా సీప్లేన్ అందుబాటులోకి రానుంది. అక్కడ ఏరోడ్రోమ్ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. సముద్ర తీర ప్రాంతం, నది, కాలువలకు అనుసంధానంగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ ఏరోడ్రోమ్‌ల ఏర్పాటుకు కన్సల్టెన్సీల కోసం రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ మార్చి నెలలో టెండర్లు పిలిచింది. వాటిని పరిశీలన కోసం పంపారు. మొదటి దశలో ప్రతిపాదించిన ప్రాంతాల్లో కాకినాడ, కోనసీమ ఉండడంతో మరికొన్ని నెలల్లోనే సీ ప్లేన్‌లు అందుబాటులోకి రానున్నాయి.

నర్సుల సేవలు.. అనన్యసామాన్యం

- కొవిడ్ సమయంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పనిచేశారు: డిప్యూటీ సీఎం పవన్



పిఠాపురం నియోజకవర్గంలో ఉత్తమ సేవలందిస్తున్న ప్రభుత్వ స్టాఫ్ నర్సులతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



ఉత్తమ సేవలందించిన పిఠాపురం స్టాఫ్ నర్సు చిన్నారిని సత్కరిస్తున్న పవన్‌కల్యాణ్

పిఠాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో రోగులకు స్వస్థత చేకూరేలా నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యమని, వారి సేవల ద్వారా వృత్తికే గౌరవాన్ని తీసుకువస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ కొనియాడారు. నిస్వార్థంగా వారు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఆయన ప్రశంసించారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గంలోని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్‌సెంటర్లు, సీహెచ్‌సీల్లో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులతో సమావేశమయ్యారు. ఉత్తమ సేవలు అందిస్తున్న 8మంది స్టాఫ్‌నర్సులను సత్కరించారు. నర్సుల చేతిస్పర్శ కూడా రోగుల్లో మానసిక స్థైర్యాన్ని, సాంత్వనను కలగచేస్తుందని తెలిపారు. విధినిర్వహణలో ఎంతోమంది ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరు మరిచిపోలేరని చెప్పారు. మీరు పడే కష్టం, శ్రమ తనకు తెలుసునని తెలిపారు. కొవిడ్‌సమయంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా నర్సులు విధులు నిర్వహించిన విషయం మరువలేమని చెప్పారు. ఇటీవల సింగపూర్‌లో తన కుమారుడు మార్క్ శంకర్ ప్రమాదానికి గురైనప్పుడు తాను ఆస్పత్రిలో ఉన్న సమయంలో అక్కడ నర్సులు చేసిన సేవలు చూసినప్పుడు మరొకసారి మీ కష్టం గుర్తుకు వచ్చిందని వివరించారు. అందుకే నర్సులను స్వయంగా కలిసి మీరు అందించే సేవలు నిరుపమానమైనవని చెప్పి కృతజ్ఞతలు తెలపాలని భావించానని తెలిపారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మిమ్మల్ని కలిసే అవకాశం రావడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని చెప్పారు. వారు తెలిపిన సమస్యలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఉత్తమ స్టాఫ్‌నర్సులు ఆర్.చిన్నారి, జి.సత్యవతి, బి.జీవిత, టి.సూర్యామణి, జె.భాగ్యరేఖ, పి.సూర్యకుమారి, ఎం.బుజ్జమ్మ, వి.విమలకుమారిలను పవన్ సత్కరించి పురస్కారాలు అందజేశారు.

మోతుగూడెంలో అతిథిగృహాలు, రిసార్ట్స్ తనిఖీ



మోతుగూడెం రిసార్ట్స్‌లో పర్యాటకుల వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ

మోతుగూడెం, మే 12 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రిసార్ట్‌ల యజమానులకు పలు సూచనలు ఇచ్చారు. మద్యం, గంజాయి సేవించడం, ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూసుకోవాలని యజమానులకు తెలియజేశారు. అనంతరం అతిథిగృహాలకు కస్టమర్లు వచ్చినప్పుడు ప్రతి వ్యక్తి పేరు, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు, నమోదు చేసిన తర్వాత గదులు కేటాయించాలని రిసెప్షన్ బుక్‌లో కచ్చితంగా వారి వివరాలు నమోదు చేయాలని అతిథిగృహ యజమానులకు తెలిపారు. అనంతరం కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా అతిథిగృహాలకు వస్తే వెంటనే పోలీసులకు 94409 00757 నెంబరులో సమాచారం ఇవ్వాలని సూచించారు.



సూర్యారావుపేట సముద్ర తీరంలో భావనారాయణ స్వామికి చక్రస్నానం చేయిస్తున్న పండితులు

వైభవంగా భావనారాయణస్వామికి చక్రస్నానం



సర్పవరం జంక్షన్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన సోమవారం చక్రస్నానం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయం వద్ద స్వామివారికి పండితులు ప్రత్యేక పూజలు జరిపి పుష్పక వాహనంపై వేలాది మంది భక్తుల ఊరేగింపు నడుమ సూర్యారావుపేట సముద్రతీరానికి తోడ్కొని వెళ్లారు. అక్కడ ప్రత్యేకంగా తయారు చేయించిన వేదికపై చక్రపెరుమాళ్లకు అభిషేకం చేసిన తర్వాత సముద్రనీటితో చక్ర తీర్థ ప్రోక్షణ చేయించారు. సాయంత్రం ఆళ్వార్లు స్వామివారు చినపుష్పక వాహనం (శేష వాహనం)పై వేంచేయగా గ్రామోత్సవం, చోరోత్సవం జరిపారు. సహాయ కమిషనరు, ఈవో ఎం.లక్ష్మీనారాయణ, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



30 రకాల విత్తనాలతో పెరుగుతున్న మొక్కలు

- 30 రకాల విత్తనాలతో పోషకాల తయారీ
- సహజ పద్ధతుల్లో భూమి సారవంతానికి కృషి
- ప్రకృతి వ్యవసాయం వైపు రైతుల మొగ్గు
- పీఎండీఎస్‌ను ప్రోత్సహిస్తున్న వ్యవసాయ శాఖ

పొలంలోనే ఎరువుల తయారీ

ఉప్పలగుప్తం, మే 12 (ఆంధ్రజ్యోతి): నాట్లు వేసిన తర్వాత రసాయనిక ఎరువులు వాడనవసరం లేదు. ప్రతి పంటకు ముందుగానే నేలలో ఎరువులు తయారు చేసుకోవచ్చు. కేవలం 30 రకాల విత్తనాలు పొలంలో చల్లుకుని పైరుకు కావలసిన పోషకాలను సహజ పద్ధతిలో తయారు చేసుకోవచ్చు. ఒకప్పుడు పశువుల పెంట, ఇతర సహజ సిద్ధ ఎరువుల వాడకంతో రైతులు భూసారాన్నిపెంచుకునేవారు. ఎకరా దిగుబడులు తక్కువే అయినా నాణ్యమైన పంట చేతికొచ్చేది. అందుకే తాము పండించిన ధాన్యాన్నే మరపట్టించి, బియ్యాన్ని నిల్వ చేసుకుని తినేవారు. తొలకరి వానలకు మట్టి కమ్మని వాసనతో గుబాళించేది. అనంతర కాలంలో ఎకరా దిగుబడులు గణనీయంగా పెరగాలన్న లక్ష్యాలు రైతులను రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకానికి పురిగొల్పాయి. ఇదే అదనుగా కార్పొరేట్ కంపెనీలు వివిధ రకాల రసాయనాల ఎరువులతో రైతులను ఆదాయ వనరుల పెంపు ఆలోచన వైపు మళ్లించాయి. ఫలితంగా రసాయనిక ఎరువులు వినియోగించనిదే పంట పండని పరిస్థితి ఏర్పడింది. రసాయనిక ఎరువుల వాడకంతో దిగుబడులు పెరిగిన నిష్పత్తిలోనే పైరుకు తెగుళ్ల బెడద ఏర్పడింది. పంట నాణ్యత తగ్గింది. తాను పండించిన గింజలను తానే తినలేని పరిస్థితిలో అన్నదాత అయోమయంలోపడ్డాడు. పొలాల్లో మట్టి కాలుష్యంతో విషాల్ని వెదజల్లుతోంది. అన్నదాత ఆలోచనలో పడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో చాలా కాలంగా కొందరు రైతులు తమకున్న పొలంలోని కొంత విస్తీర్ణంలో సేంద్రియ ఎరువులతో ప్రకృతి సాగు చేస్తున్నారు. చీడపీడల నివారణకు సహజ పద్ధతుల్లోనే నివారణ చర్యలు చేపడుతున్నారు. ఆ పంటనే ఏడాది పాటు తింటున్నారు.

భూసార పరిరక్షణకు అవసరమైన సహజ పోషకాలు,సూక్ష్మ పోషకాలు ఈ 30 రకాల పైరు నుంచి లభిస్తాయి. నత్రజని భూమిలో కావలసినంత నిల్వ ఉంటుంది. ఆయా విత్తన జాతుల నుంచి జింకు, లవణాలు, వివిధ పోషకాలు నేలలోనే పేరుకుని నేల దుక్కి అనంతరం పైరుకు అందుతాయి. భూమిలో వానపాముల ఉత్పత్తి పెరిగి నేల గుల్లబారుతుంది. నేలకు నీరు నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. పశువులకు పచ్చిగడ్డి మేత దొరుకుతుంది. పైరుకు రసాయనిక ఎరువుల ఆవశ్యకత ఉండదు. ప్రకృతి విధానంలో పోషకాలు అందడంతో పైరుకు చీడపీడల బెడద ఉండదు. పంటలో నాణ్యత ఉంటుంది. ఫలితంగా మార్కెట్లో ప్రకృతిసాగు దిగుబడులకు మంచి గిరాకీ ఉంటుంది. ఇప్పటికే సేంద్రియ ఎరువులు వాడి, ప్రకృతి సాగు చేస్తున్న రైతుల ఉత్పత్తులకు ఎంత గిరాకీ ఉందో అందరికీ తెలిసిందే. ఎకరా పెట్టుబడులు తగ్గడంతో దిగుబడులు తగ్గినా మార్కెట్ డిమాండ్‌తో ఎకరాకు వచ్చే ఆదాయం సంతృప్తికరంగానే ఉంటుందన్నది రైతుల అనుభవాలు తేటతెల్లం చేస్తున్నాయి.

నాట్లు వేశాక ఎరువులను వాడటానికి బదులు ముందుగానే నేలలో పంటకు అవసరమైన సహజ పోషకాలను నిల్వ చేస్తే ఎలా ఉంటుంది? ఈ ఆలోచనతోనే ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ ప్రకృతి వ్యవసాయం పేరుతో ప్రభుత్వం పీఎండీఎస్ (ప్రీమాన్‌సూన్ డ్రై సోయింగ్) విధానాన్ని అమలు చేస్తోంది.



ప్రకృతి సాగు పద్ధతిలో కోతకు సిద్ధంగా ఉన్న వరి చేను



గొల్లవిల్లిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది (పాత చిత్రం)

5 రకాల పప్పు విత్తన జాతులు, 6 రకాల చిరుధాన్యాలు, 4 రకాల పచ్చిరొట్ట విత్తనాలు, రెండు రకాల సుగంధ ద్రవ్యాలు, 3 రకాల ఆకుకూర విత్తనాలు, 8 రకాల కాయగూర విత్తనాలు, రెండు రకాల నూనె గింజల విత్తనాలు... మొత్తం 30 రకాల విత్తనాలను దాళ్వా కోతల సమయంలో పొలంలో చల్లుతారు. లేదా మూడో పంటగా చల్లి సాగు చేస్తారు.



రైతులకు ప్రకృతి సాగుపై అవగాహన కల్పిస్తున్నాం

ఎస్ఎం షంషీ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు

ప్రకృతి సాగుపై వ్యవసాయ శాఖ రైతులకు గ్రామగ్రామనా అవగాహన కల్పిస్తోంది. ఇటీవల కోనసీమవ్యాప్తంగా రైతులకు పీఎండీఎస్ విధానం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. 30 రకాల విత్తనాల సంచులను రైతులకు అందించారు. ప్రస్తుతం పలువురు రైతులు కోతల సమయంలో ఈ విత్తనాలను చల్లుతున్నారు. ఈ విధానంతో పొలాలకు సారం చేకూరడంతో పాటు సాగుకు ముందే కొంత ఆదాయాన్ని సమీకరించుకోవచ్చు. ఆకు కూరలు, కాయగూరలు, అపరాలతో తదుపరి సాగుకు ముందే రైతుకు ఆదాయం లభిస్తుంది. ఈ 30 రకాల వేర్లను భూమిలోనే దుక్కి చేయడంతో అవసరమైన లవణాలు, నత్రజని, ఇతర పోషకాలు పైరుకు పుష్కలంగా లభిస్తాయి. ప్రకృతి సాగు చేస్తున్న రైతులతో పాటు గ్రామంలో మరికొందరు రైతులను ఎంపిక చేసి ప్రకృతి వ్యవసాయ శాఖతో పాటు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పీఎండీఎస్ అమలు చేస్తున్నాం.

వేడుకగా సత్యదేవుడి చక్రస్నానం


పంపా సరోవరంలో చక్రస్నానం నిర్వహిస్తున్న రుత్విక్‌లు, ఈవో

నేడు శ్రీపుష్పయాగం

అన్నవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవంగా పూజలందుకుంటున్న అన్నవరం సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలలో భాగంగా సోమవారం పంపాసరోవరం వద్ద చక్రస్నానం కార్యక్రమం వేడుకగా జరిగింది. ఉదయం 9గంటలకు నవదంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను... పెళ్లిపెద్దలైన సీతారాములను మేళతాళాలు, పం డితుల వేదమంత్రోచ్చరణల నడుమ కొండపై నుంచి ఘాట్ రోడ్డు గుండా పంపాతీరం వద్ద నున్న ప్రత్యేక వేదిక వద్దకు తోడ్కొనివచ్చారు. ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించి అనంతరం పంపాసరోవరంలో స్వామి, అమ్మవార్లను, త్రిశూలం, సుదర్శనచక్రంలతో ముమ్మారు స్నానమాచరింపచేశారు. తిరిగి వేదికవద్దకు తీసుకెళ్లి పూజలనంతరం చతుర్వేదపండితులు వేదాశీర్వచనాలందజేశారు. ఈ సందర్భంగా కంకణ విమోచన గావించారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు చైర్మన్ ఐవీ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న కల్యాణోత్సవాలు

సత్యదేవుడికి శ్రీ విశ్వావసు నామసంవత్సర దివ్యకల్యాణోత్సవాలు మంగళవారం రాత్రికి జరి గే శ్రీపుష్పయాగంతో ముగియనున్నాయి. రాత్రి 8 గంటలకు స్వామివారి నిత్యకల్యాణ మండపంలో ఈ వేడుకను నిర్వహిస్తారు. వివిధ సుగంధభరిత పుష్పాలతో నవదంపతులను అర్చించి విశేషపదార్థాలను నివేదిస్తారు. అనంతరం దంపతీతాంబూలాలు అందించి మహిళలకు రవిక వస్త్రాలు బహూకరిస్తారు.

ఉల్లాసంగా నాకబలి, దండియాడింపు

సాయంత్రం 4గంటలకు అనివేటి మండపం లో నాకబలి, దండియాడింపు కార్యక్రమాలు ఉ ల్లాసంగా జరిగాయి. అమ్మవారికి నల్లపూసలు గుచ్చి వసంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ముందుకుసాగారు. అర్చకస్వాములు స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఎత్తుకుని నృత్యంచేశారు.



నృత్యం చేస్తున్న అర్చకస్వాములు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అంతర్వేదిలో హైకోర్టు జడ్జి పూజలు


జడ్జి మాండవ కిరణ్మయికి స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

అంతర్వేది, మే 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి ఏపీ హైకోర్టు జడ్జి మాండవ కిరణ్మయి సోమవారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో దర్శనం కల్పించి వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. అనంతరం హైకోర్టు జడ్జి మాండవ కిరణ్మయి దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఏసీ సత్యనారాయణ అందించారు.

ద్రాక్షారామలో సీఎంవో కార్యదర్శి పూజలు


పూజలు చేస్తున్న మిశ్రా దంపతులు

ద్రాక్షారామ, మే 12 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని సోమవారం సీఎంవో కార్యదర్శి కార్తికేయ మిశ్రా సతీసమేతంగా సందర్శించారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవానీ, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మిశ్రా దంపతులు భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శన అనంతరం నంది మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందుకున్నారు. వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందచేశారు. మిశ్రా వెంట ఆర్డీవో దేవరకొండ అఖిల, తహశీల్దార్ మృత్యుంజయరావు, ఎస్‌ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.

అన్నవరంలో యనమల పూజలు

అన్నవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధిలో సోమవారం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవీ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో కొండలరావు, అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు తదితరులు ఉన్నారు.


సత్యదేవుడి దర్శనానంతరం యనమల రామకృష్ణుడు

సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా స్వామినాయుడు


బాధ్యతలు స్వీకరిస్తున్న స్వామినాయుడు

మోతుగూడెం, మే 12(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా స్వామినాయుడు బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయనకు లోయర్ సీలేరు ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, డీఈఈ వరప్రసాద్, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, సీనియర్ ఎకౌంట్ ఆఫీసర్ వరప్రసాద్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఇక్కడ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న వాసుదేవరావు కడప ఆర్టీపీపీకి బదిలీ అయ్యారు. వాసుదేవరావు నుంచి స్వామినాయుడు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం (టీఎన్‌వీకేఎస్) యూనియన్ నాయకులు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జాజుల రత్నాకర్ మూర్తి, లక్ష్మణ్‌కిరణ్, జెన్‌కో ఉద్యోగులు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ మృతి కేసులో రూ.5లక్షల పరిహారం

జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలతో ఏపీ ప్రభుత్వం జీవో జారీ

రాజమహేంద్రవరం, మే 12(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ జైలులో నాలుగేళ్ల క్రితం మృతి చెందిన ఖైదీ కేసులో అతడి కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు జారీ చేయగా.. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది. వివరాల్లోకి వెళితే.. ప్రస్తుత ఏఎస్ఆర్ పాడేరు జిల్లాకు చెందిన కళ్యాణం వెంకన్న(32) తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు రిమాండు ఖైదీగా వచ్చాడు. 2021 మే 4న అతడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై పలు విచారణలు పరిశీలించిన ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల 2024 మార్చి 21న ఆదేశాలు జారీ చేసింది. వాటిని పరిగణనలోకి తీసుకుంటూ వెంకన్న కుటుంబీకులకు రూ.5లక్షల నష్ట పరిహారం చెల్లించాలని ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఐడియా సో (ఫ్రె) ఫిష్!



ఉపాయం ఉండాలే గానీ ఉపయోగపడని దంటూ ఏదీ ఉండదని పెద్దలు చెబుతుంటారు. ఈ ఫొటోను చూస్తే ఆ మాటలను నిజమే అనిపించక మానదు. పాడైపోయిన ఫ్రిజ్‌లు పాడైతే కొన్నాళ్లు మూలన ఉంచి తర్వాత పాత సామాన్ల వాడికి అమ్మేయడం, చేస్తుంటారు. అయితే అలాంటి ఫ్రిజ్‌లను కూడా అక్వేరియంగా ఉపయోగించుకుంటే ఇలా ఉంటుంది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓ మార్కెట్‌లో చేపల వ్యాపారులు పాడైపోయిన ఫ్రిజ్‌లలో అరలు, డోరును తీసేసి ఇదిగో ఇలా పడుకోబెట్టి నీళ్లు పోసి చేపలను వేస్తున్నారు. వాటికి ఆక్సిజన్ అందడానికి యాభై రూపాయలతో చిన్న యంత్రాన్ని పెడుతున్నారు. దీంతో చేపలు తాజాదనంతో పాటు ఎక్కువసేపు బతికి ఉంటున్నాయి. వీటిని చూసిన జనం. ఈ ఫ్రెస్ ఐడియా బాగుందే అనుకుంటున్నారు.

- రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)

మంచినీటి చెరువులో మృతదేహం లభ్యం


లభ్యమైన మృతదేహం

రంగంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రంగంపేటలోని మంచినీటి చెరువులో సోమవారం ఉదయం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ ఎస్ శివప్రసాద్ తెలిపారు. సుమారు 25-30 ఏళ్లు ఉండే వ్యక్తి మృతదేహం నీటిలో కనిపించగా స్థానిక వీఆర్వోకు చుట్టు పక్కలవారు సమాచారం ఇవ్వడంతో వీఆర్వో ఇచ్చిన రిపోర్టుపై కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. వివరాలు తెలిసినవారు అనపర్తి సీఐ 9440796538, రంగంపేట ఎస్‌ఐ 9440904854లో తెలియజేయాలని కోరారు.

ఉద్యాన పరిశోధన కేంద్ర అధిపతి బదిలీ

అంబాజీపేట, మే 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు బదిలీ అయ్యారు. తాడేపల్లిగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉద్యాన సమాచార కేంద్రం ప్రిన్సిపాల్ సైంటిస్టుగా బదిలీపై వెళ్తున్నారు. అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రంలో అధిపతిగా ఆయన ఎన్నో ఏళ్లు సేవలందించారు.

కౌడా చైర్మన్ పదవికి తుమ్మల రాజీనామా

కార్పొరేషన్(కాకినాడ), మే 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడా) చైర్మన్ తుమ్మల బాబును డీసీసీబీ చైర్మన్ పదవి వరించడంతో ఒకే వ్యక్తి రెండు నామినేటెడ్ పదవుల్లో ఉండకూడదన్న నిబంధన ఉంది. దీంతో తాను కౌడా చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు తుమ్మల వెల్లడించారు. దీంతో ఆ చైర్మన్ కుర్చీ ఖాళీ అవ్వడంతో కొంతమంది ఆశావాహులు ఎవరి ప్రయత్నాలు వారు ప్రారంభించారు.

అడ్డతీగలలో భారీ వర్షం

అడ్డతీగల(వై.రామవరం), మే 12(ఆంధ్రజ్యోతి): అడ్డతీగలలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు పలుచోట్ల భారీ వృక్షాల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో మధ్యాహ్నం 3గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. విద్యుత్ లేక రంపచోడవరం నుంచి అడ్డతీగల వరకు వచ్చే లైన్లలో ఇబ్బందులేర్పడి రాత్రంతా అడ్డతీగల, వై. రామవరం మండలాల్లో అంధకారం అలుముకుంది.


అడ్డతీగలలో విద్యుత్ లైన్ల మరమ్మతులు

మాతృత్వానికే మాయని మచ్చ


పిఠాపురంలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ మణికుమార్

- రెండో పెళ్లికి అడ్డువస్తుందనే చిన్నారిని పీక నులిమి చంపేసి నూతిలో పడేశారు
- అమ్మ, అమ్మమ్మ కర్కశత్వం
- హత్య కేసులో ఇద్దరి అరెస్టు

పిఠాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): రెండో పెళ్లికి అడ్డుగా ఉందనే ఉద్దేశ్యంతో కర్కశత్వం ప్రదర్శించి కన్నపేగునే చిదిమేసింది ఆ కన్న (కసాయి) తల్లి. అందుకు పూర్తిగా సహకరించింది అమ్మమ్మ. మాతృత్వానికే మాయని మచ్చగా మిగిలిన ఈ సంఘటనలో ఐదు నెలల చిన్నారిని అత్యంత పాశవికంగా పీక నులిమి చంపివేసి పక్కనే ఉన్న నూతిలో పడవేసి, క్షుద్రపూజలు జరిగినట్టు చూపించి హత్యను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. పోలీసుల విచారణలో అసలు విషయాలు వెలుగు చూడడంతో చిన్నారిని హత్య చేసిన అమ్మ, అమ్మమ్మలను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్‌ఐ మణికుమార్ వెల్లడించారు.

అసలేం జరిగిందంటే...

పిఠాపురం పట్టణం జగ్గయ్యచెరువు కాలనీకి చెందిన ఐదు నెలల చిన్నారి యశ్వితను ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత చంపి నూతిలో పడవేశారని నరసింగపురం గ్రామానికి చెందిన పెదపాటి సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై హత్య కేసు నమోదు చేసి ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. ఈ కేసులో సాంకేతిక పరమైన అంశాలను ఆధారంగా చేసుకుని విచారణ చేపట్టారు. తల్లి, అమ్మమ్మ ఈ హత్యకు చేసినట్టు నిర్ధారణకు వచ్చారు. చనిపోయిన యశ్విత తల్లి పసుపులేటి శైలజ, పెదపాటి సతీష్ ప్రేమించి ఇరు కుటుంబాలకు ఇష్టం లేకుండా పెళ్లి చేసుకున్నారు. వీరికి ఐదు నెలల క్రితం పాప (యశ్విత) పుట్టింది. శైలజ వివాహం జరిగిన నాటి నుంచి భర్త తనను అత్తవారింటికి తీసుకువెళ్లకపోవడం, యశ్విత పుట్టినప్పుడు భర్త కుటుంబసభ్యులు, బంధువులు రాకపోవడం, భర్త ముందులా సఖ్యతతో లేకపోవడం శైలజ కొంతకాలంగా ఇబ్బందిగా ఉంది. అదే సమయంలో ముందు నుంచీ అనుకున్న మేనత్త కొడుకుతో కాకుండా ప్రేమించి వివాహం చేసుకోవడం, సతీష్‌కు పుట్టిన యశ్వితను అడ్డు తొలగిస్తే శైలజకు రెండో పెళ్లి చేయవచ్చని అమ్మమ్మ పసుపులేటి అన్నవరం భావించింది. అమ్మ శైలజ, అమ్మమ్మ అన్నవరం కలిసి పథకం ప్రకారం ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి చిన్నారి యశ్విత పీక నొక్కి చంపేసి వాళ్ల ఇంటి వెనుక ఉన్న అద్దాల కుమారి ఇంటి ఆవరణలో గల బావిలో పడేశారు. అనంతరం చేసిన హత్యను కప్పి పుచ్చుకునేందుకు పాపను ఎవరో మాంత్రికుడు చేతబడి చేసి చంపి ఉంటారని నమ్మించేందుకు ఇంటి ముందు పసుపు, కుంకుమ, నిమ్మకాయలు వేసి క్షుద్రపూజలు జరిగినట్టు చూపించారు. అయితే అక్కడ వేసిన పసుపు, కుంకుమ ఇంటిలో నుంచి తెచ్చినట్టు ఉండటం, బావి సమీపంలో అమ్మమ్మ సెల్ పడిపోవడం తదితర అంశాల ఆధారంగా కేసు దర్యాప్తు సాగించి ఇద్దరినీ అరెస్టు చేశారు.

లోతుగా విచారణ

చిన్నారి హత్య కేసులో మరికొంత మంది పాత్ర ఉంటుందనే భావనలో పోలీసులు ఉన్నా రు. దీంతో మరింత లోతుగా విచారణ సాగించాలని నిర్ణయించారు. కోర్టు అనుమతితో అమ్మ, అమ్మమ్మలను అదుపులోకి తీసుకోవాలని భావిస్తున్నారు. భర్త, మేనమామ, తాతయ్య, ఇతర కుటుంబసభ్యుల పాత్రపై విచారణ జరపనున్నారు. అదే విధంగా శైలజ సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు అందులోని వాట్సాప్ సంభాషణలు, ఫోన్ కాల్స్‌ను విశ్లేషిస్తున్నారు.

అందరికి న్యాయం చెప్పే...

హత్య కేసులో కీలకంగా ఉన్న చిన్నారి యశ్విత అమ్మమ్మ అన్నవరం వారి కులపెద్దల్లో ఒకరిగా ఉంది. పలు విషయాల్లో న్యాయం చెప్పా ఉండడంతో పాటు గొడవలు, వివాదాలు సర్దుబాటు చేస్తుంది. అందరికీ న్యాయం చెప్పే ఈమె మాత్రం కూతురితో కలిసి ముక్కుపచ్చలారని ఐదు నెలల ఆడబిడ్డను పీక నులిమి హత్య చేయడం విస్మయాన్ని కలిగించింది. అమ్మ, అమ్మమ్మలు ఇంత కర్కశత్వంగా ఎలా వ్యవహరించగలిగారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు విచారణలో మరిన్ని విషయాలు వెలుగుచేసే అవకాశాలున్నాయనిభావిస్తున్నారు.

అత్తింటికి పయనమై.. అంతలోనే కన్నుమూసి

బస్సు ఢీకొనడంతో గాయాలపాలై మృతి

ద్రాక్షారామ, మే 12 (ఆంధ్రజ్యోతి): అత్తవారింటికి వెళ్తూ యువకుడు మృతిచెందిన సంఘటన కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ ఏనుగుబాయి తూము వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రపురం మండలం హసన్‌బాదకు చెందిన పిల్లి గోపాలకృష్ణ (27) గొల్లపాలెంలో మోటారు సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతడికి గత నెల 22న కె.గంగవరం మండలం శివల గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. సోమవారం ఉదయం అత్తింటికి వెళ్తుండగా ద్రాక్షారామ- యనాం రోడ్డులో యానాం వెళ్తున్న ఆర్టీసీ బస్సు చిన్నగా ఢీకొనడంతో గాయాలపాలై రోడ్డుపై పడ్డాడు. గోపాలకృష్ణను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ద్రాక్షారామ ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న గోపాలకృష్ణ తల్లి, తండ్రి, సోదరి ఉన్నారు. వివాహం జరిగిన 20 రోజులకే మృతిచెందడంతో కుటుంబీకులు తీవ్రంగా రోదిస్తున్నారు.


గోపాలకృష్ణ (ఫైల్)

పెళ్లికి వెళ్తే ఇల్లు గుల్ల

ఇంటి తాళాలు బద్దలుకొట్టి చోరీ

రూ.9.80 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు, రూ.8లక్షల నగదు మాయం


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

కొవ్వూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు తెరచి రూ.8 లక్షల విలువైన బంగారు వస్తువులు, నగదు దొంగిలించుకు పోయినట్టు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె. శ్రీహరిరావు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పెనకనమెట్ట గ్రామానికి చెందిన నాగిరెడ్డి సత్తిబాబు కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 11న ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట పెళ్లికి పందలపర్రు వెళ్లాడు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తలుపులు తెరచి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న సామాన్లన్నీ చిందరవందరగా పడవేసి ఉండడంతో దొంగతనం జరిగిందని గమనించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.9.80 లక్షల విలువైన 8 కాసుల బంగారు వస్తువులు, 250 గ్రాముల వెండి వస్తువులు, రూ.8లక్షల నగదు దొంగిలించుకుపోయారని పేర్కొన్నాడు. సమాచారం తెలిసిన వెంటనే ఇంచార్జి డీఎస్పీ కె.సత్యనారాయణ, రూరల్ సీఐ కె.విజయ్‌బాబు, రూరల్ ఎస్‌ఐ కె. శ్రీహరిరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్రైం సీఐ శ్రీధర్, క్లూస్ టీము, క్రైం టీములను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. నాగిరెడ్డి సత్తిబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీహరిరావు తెలిపారు.

మండేన్

ప్రచండభానుడి ప్రతాపంతో ప్రజలు అల్లాడిపోయారు. సోమవారం రాజమహేంద్రవరంలో అత్యధికంగా 43 డిగ్రీలు, కాకినాడలో 38 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో పలు ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి.



రాజమహేంద్రవరంలో నిర్మానుష్యంగా పుష్కర్‌ఘాట్ రోడ్డు



రాజమహేంద్రిలో ఎండ దెబ్బ తగలకుండా ఏర్పాట్లు


కాకినాడలో ఎండలో ప్రజల పాట్లు

ఘనంగా బంగారమ్మ తల్లి తీర్థం

కొత్తపేట, మే12(ఆంధ్రజ్యోతి): కొత్తపేట గ్రామ దేవత బంగారమ్మ తల్లి తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి పెద్ద జాగరం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తీర్థం సందర్భంగా అధికసంఖ్యలో భక్తులు అమ్మవార్ని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. గ్రామదేవతకు చలివిడి, పానకాలు సమర్పించారు.

బుద్ధ పౌర్ణమి పూజలు

మలికిపురం, మే 12(ఆంధ్రజ్యోతి): వైశాఖ బుద్ధ పౌర్ణమి సందర్భంగా సోమవారం పలు ఆలయాల్లో పూజలు చేశారు. పలు చోట్ల పానకాలు పంపిణీ చేశారు. మోరి వీరభద్రస్వామి మెరక వద్ద పోతురాజుస్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

విద్యతోనే అసమానతలు రూపుమాపవచ్చు

- ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు


అంబేడ్కర్ జయంతి సభలో మాట్లాడుతున్న ఎంపీ హరీష్‌మాధుర్

ముమ్మిడివరం, మే 12(ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే సమాజంలోని సాంఘిక అసమానతలను రూపుమాపడం సాధ్యమవుతుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. సోమవారం రాత్రి ముమ్మిడివరం నగర పంచాయతీ అంబేడ్కర్ కన్వెన్షన్ హాలు వద్ద కమిడి ఛైర్మన్ ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. దేశానికి దిశా, దశ నిర్దేశించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. అంటరానితనాన్ని తరిమికొట్టేందుకు ఎంతో కృషి చేసారన్నారు. అన్ని జాతులకు మార్గ దర్శకాన్ని ఇచ్చిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని, ఆయన్ను ప్రపంచ మేధావిగా గుర్తించారన్నారు. ప్రతీ ఒక్కరూ విద్యావంతులు కావడం ద్వారానే సమాజంలోని అసమానతలను రూపుమాపడంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అంబేడ్కర్ ఎంతో కష్టపడి ఉన్నత చదువులు చదివి దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించిన మహోన్నత వ్యక్తి అన్నారు. యువత అంబేడ్కర్ ఆశయ సాధనలో పయనించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీనికి ముందు పోలమ్మ చెరువుగట్టున ఉన్న అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహానికి నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ పూలమాలలువేసి నివాళులర్పించారు. పల్లిపాలెం సెంటర్ నుంచి తీన్మార్ డప్పు వాయిద్యాలు, బ్యాండు మేళాలతో ర్యాలీగా అంబేడ్కరీయులంతా తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, జనచైతన్య మండి వ్యవస్థాపక అధ్యక్షుడు పి.పావన్‌ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే చెల్లివివేకానంద, నాయకులు చెల్లి అశోక్, కాశి జగపతి, ఎం.ఆశీర్వాదం, పి.రజనీ, కాశి బాలమునికుమారి, పెనుమాల సుదీర్, కాశి వెంకటాచారి, దోనిపాటి ఆంజనేయులు, వడ్డి నాగేశ్వరరావు, దేవరపల్లి ఏడుకొండలు, మట్టా శ్రీనివాసరావు, బుడితి శ్రీనివాస్, కాశి లాజర్, కాశి రామకృష్ణ, మెండి కమల, గొల్లపల్లి గోపి, చీకురుమెల్లి శ్రీనివాస్‌లతో పాటు అంబేడ్కరీయులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే నగదు రికవరీ

- ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటేశ్వరరావు


పి.గన్నవరం-అంబాజీపేట రహదారి పోతవరం వద్ద నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తున్న సీఈ

పి.గన్నవరం, మే12(ఆంధ్రజ్యోతి):రోడ్డు నాణ్యతలో అలసత్వం వహిస్తే సంబంధిత కాంట్రాక్టర్ నుంచి నగదు రికవరీ చేస్తామని ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ సీఈ జి.వెంకటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.10కోట్లు దాటిన పనులు పరిశీలించి, రూ.2కోట్లు రికవరీ చేసినట్లు తెలిపారు. పి.గన్నవరం-అంబాజీపేట రహదారి నాణ్యతను సోమవారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో నల్లమట్టి స్వభావం ఎక్కువగా ఉంటుందని, తద్వారా రహదారులు తొందరగా క్రుంగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈనేపథ్యంలో రోడ్డులు పటిష్టంగా నిర్మించడానికి ప్రతి విషయాన్ని సూక్ష్మస్థాయిలో పరిశీలన చేస్తున్నామన్నారు. నల్లమట్టి నేపథ్యంలో రాజవరం-పొదలాడ రహదారిలో పలు చోట్ల సీసీ రోడ్లకు సిఫార్సు చేశామన్నారు. పి.గన్నవరం-అంబాజీపేట రహదారిలో పోతవరం వద్ద క్రుంగిన చోట 360 మీటర్ల మేర రోడ్డును 1.50మీటర్ల లోతు నుంచి పటిష్టపర్చాలని సూచించామన్నారు. ఈనేపథ్యంలో అక్కడ లైమ్ స్టెబిలైజేషన్ పద్ధతితో రహదారిని పటిష్టపర్చా మన్నారు. ఈరహదారిని పూర్తి నాణ్యతా ప్రమాణా లతో పూర్తిచేశారని సంతృప్తి వ్యక్తం చేస్తూ స్థానిక అధికారులను అభినందించారు. ఆర్ అండ్‌బీ డీఈ రాజేంద్ర మాట్లాడుతూ రూ.36కోట్లతో జరిగిన ప్యాకేజీ రోడ్డు పనుల్లో భాగంగా రహదారి భద్రత పనులు మినహా దాదాపుగా రహదారులన్నీ పూర్తయ్యాయన్నారు సీఈ వెంట క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ జీవీ భాస్కరావు, డీఈ పి.హరిప్రసాద్, ఆర్అండ్‌బీ డీఈ జి.రాజేంద్ర, జేఈలు త్రినాధరావు, భవాని, ప్రదీప్‌కుమార్ ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన


ముమ్మిడివరంలో జనకల్యాణ్ సొసైటీ ఆధ్వర్యంలో వీధి నాటకం నిర్వహిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ముమ్మిడివరం నగర పంచాయతీ మార్కెట్ ప్రాంతంలో వీధి నాటకం ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిం చారు. అలాగే కళాజాత నిర్వహించారు. వీధి నాటకం, కళాజాత ద్వారా హెచ్ఐవీ ఎలా వ్యాప్తి చెందుతుంది, హెచ్ఐవీ రాకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్నచూపు లేకుండా సమాజంలో వారితో కలిసి ఎలా జీవించాలి, హెచ్ఐవీ, క్షయవ్యాధి సంబంధిత సుఖ వ్యాధులు, చికిత్స గురించి, కండోమ్ ఉపయోగం గురించి, ఏఆర్‌సీ మందులు ఎలా వాడాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. తొలుత కార్యక్రమాన్ని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సూపర్‌వైజర్ ఎ.బుజ్జిబాబు ప్రారంభించారు. మే 12నుంచి జూన్ 30వరకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వీధి నాటకాలు ప్రదర్శిస్తారన్నారు. జనకల్యాణ్ సంస్థ మేనేజర్ శ్రీనివాస్, ముమ్మిడివరం పీహెచ్‌సీ ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిల్ టి.అంజనిదేవి, రాష్ట్ర సాధికార అంగన్‌వాడీ డ్వాక్రా ఆర్గనైజింగ్ సెక్రటరీ మెండి కమల, బ్లడ్ స్టోరేజ్ యూనిట్, ఐసీటీసీ సిబ్బంది నల్లం దుర్గాప్రసాద్, వెంకటరత్నం, రేవు కిశోర్, చెల్లి ఈశ్వరి, జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ, లింకు వర్కర్స్ సత్యనారాయణ, శాంతి, ఏఎన్ఎం వెంకటరమణి, అమల,లోకేశ్, రామలక్ష్మిపాల్గొన్నారు.

విద్యా కోర్సులకు ఆహ్వానం

యానాం, మే 12(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలోని వివిధ కళాశాలల్లో ప్రొఫెషనల్ కోర్సులకు సెంటాక్ (సెంట్రలైజ్డ అడ్మిషన్ కమిటీ) ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు అధికారులు తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి బీటెక్, బీఆర్క్, బీఎస్సీ, బీపీటీ, అగ్రికల్చర్ తదితర పారా మెడికల్ కోర్సులు, ఆర్ట్స్, సైన్సు కోర్సుల్లో ప్రవేశానికి అభ్యర్థులు ఈనెల 31లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సెంటాక్ పుదుచ్చేరి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్

యానాం, మే12(ఆంధ్రజ్యోతి):యానాం జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో యానాండిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ మంగ ళవారం నుంచి నిర్వహిస్తున్నట్టు ప్రతినిధి పంతగడ సుమన్ తెలిపారు. ఈక్యాంప్ 25రోజులు కొనసాగుతుందన్నారు. ఏడు నుంచి 16ఏళ్లలోపు బాల బాలికలకు కోచింగ్ ఇస్తామన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, మే 12(ఆంధ్రజ్యోతి): కందికుప్ప ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు పరిధిలో కందికుప్ప సెంటర్‌లో మెయిన్ పైప్‌లైన్ పగిలింది. ఈకారణంగా ప్రాజెక్టు పరిధిలోని కందికుప్ప, దొంతికుర్రు, పల్లం, పల్లంకుర్రు, బ్రహ్మసమేధ్యం గ్రామాలకు ఈనెల13,14తేదీల్లో తాగునీటి సరఫరా ఉండదని జేఈ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా భారీ వాహనాలను కందికుప్ప వరకే అనుమతిస్తామన్నారు. పల్లంకుర్రు దిగువ గ్రామాల ప్రజలు పల్లంకుర్రు-మురమళ్ళ ఏటిగట్టు రహదారిలో రాకపోకలు సాగించాలన్నారు.

కరెంటు కష్టాలు తీర్చండి

ఉప్పలగుప్తం, మే 12(ఆంధ్రజ్యోతి): విలసవిల్లి ప్రజల కరెంటు కష్టాలు తీర్చాలంటూ ఆ గ్రామ సర్పంచ్ సలాది ఊర్మిళాసతీష్ సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఉన్న హెచ్‌టీ లైను పొలాల మధ్యన ఉండటంతో కొద్దిపాటి వర్షం లేదా గాలికి గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని ఫిర్యాదులో వివరించారు. దీనికి ప్రత్యామ్నాయంగా సమనస తూము వద్ద నుంచి హెచ్‌టీ లైన్ ఏర్పాటు చెయ్యాలని కోరారు.

ప్రమాదకరంగా వశిష్ట రేవు సీసీ రోడ్డు


గోదావరి ప్రవాహానికి కొట్టుకుపోతున్న వశిష్ట రేవు సిమెంటు రోడ్డు

అంతర్వేది, మే 12(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం అంతర్వేది వశిష్టాశ్రమ రోడ్డులో ఉన్న పుష్కర రేవు వద్ద సిమెంటు రోడ్డు గోదావరి ప్రవాహానికి కొట్టుకుపోయింది. ఇప్పటికే రోడ్డు సగం విరిగి గోదావరిలో పడిపోవడంతో స్థానికంగా ఉన్న పొన్నాడ విజయ్ సిబ్బందితో కలిసి ప్రమాదం జరగకుండా ఇసుక మూటలు అడ్డుపెట్టారు. నిత్యం గోదావరి స్నానాలు ఆచరించే పుష్కరరేవులో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. గోదావరికి ఎదురుగా ఉన్న సిమ్మెంటు రోడ్డు కావడంతో ఎటువంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు లేకపోవడం, పగలు రాత్రి ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పగలు బోటు షికార్లు ఎక్కువగా జరగడం, పర్యాటకులు రావడం, బోట్ల సిబ్బందికి వారికి సూచించడం జరుగుతుంది. రాత్రి సమయంలో ఎదురుగా ఉన్న గోదావరిలోకి వాహనాలు వెళ్లిపోయే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని భక్తులు, సందర్శకులు కోరుతున్నారు.

మావుళ్లమ్మ ఆలయంలో చండీహోమం

కాట్రేనికోన, మే 12(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మావుళ్ళమ్మ ఆలయంలో సోమవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆణివిళ్ళ ఫణికాంత్ ఆధ్వర్యంలో చెరకు మురళి దంపతులు, భక్తుల నిర్వహణలో ఈ హోమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హోమ పూజల్లో పాల్గొన్నారు. 18వ చండీహోమం సందర్భంగా ఆణివిళ్ళ రామకృష్ణపరమహంస కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. ఆలయ ప్రధాన ఆసాదు మందపల్లి మహేష్, గ్రంధి రాంప్రసాద్, ఆణివిళ్ళ సాయిబాబా, గ్రంధి నానాజీ, ఆణివిళ్ళ పవన్, సుంకర పవిత్రకుమార్, సుంకర బుజ్జి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి


ఏడీ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, మే 12(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై పోరాటంలో భాగంగా యూటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ముమ్మిడివరం జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా అధ్యక్షుడు సురేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావులు పాల్గొని విద్యారంగ సమస్యలపై మాట్లాడారు. ఉన్నత పాఠశాలల్లో 46 మంది విద్యార్థులు ఉంటే రెండో సెక్షన్ ప్రారంభించాలని, ఏప్రిల్‌లో రోల్ ఆధారంగా పోస్టులు కేటాయించాలని, ఫౌండేషన్ బేసిక్ ప్రైమరీ పాఠశాలలో 1:20 రేషియోలో పోస్టులు నింపాలని, పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ సక్రమంగా చేయాలని, పీఆర్సీ కమిటీని వేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని ఏడీ నాగేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో టి.దుర్గాప్రసాద్, వై.బాలాజీ, జీవీ రమణ, పి.వెంకటేశ్వరరావు, టి.విజయ్‌కృష్ణ, పెన్నాడ శ్రీనివాస్, కె.శ్రీనివాస్, ఎ.కాశీవిశ్వేశ్వరరావు, సీహెచ్ కేశవరావు, జిల్లాలోని 22 మండలాల యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులు

మలికిపురం, మే12(ఆంధ్రజ్యోతి): మలికిపురం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు సందర్భంగా సోమవారం విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు రాయడం వంటి పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానం విజేతలు సీహెచ్ సనాశ్రీ, పి.పూజితలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. గ్రంథాలయ అధికారి బి.నాగేంద్రుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు

ముమ్మిడివరం, మే 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి సోషల్ మీడియాలో పదేపదే తప్పుడు పోస్టులు పెడుతున్న ఓ వ్యక్తిపై కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు. కాట్రేనికోన మండలం కుండలేశ్వరం గ్రామానికి చెందిన చిక్కం నాగేంద్రపై ముమ్మిడివరం మండలం కొమానపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కుంచనపల్లి నారాయణ ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ నిర్వహించి నాగేంద్రపై కేసు నమోదుచేసి 41ఏ నోటీసులు జారీ చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి ఘనంగా చక్రస్నానం


అంతర్వేది సముద్రం వద్ద శ్రీవేంకటేశ్వరస్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న ఆలయ నిర్వాహకులు, భక్తులు

అంతర్వేది, మే 12(ఆంధ్రజ్యోతి):అంతర్వేది గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజులుగా జరుగుతున్న స్వామివారి కల్యాణోత్సవాల్లో చివరి రోజైన సోమవారం ఉదయం ఆరు గంటలకు స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. తొలుత ఆలయం వద్ద నుంచి డోలుసన్నాయి వాయిద్యాల నడుమ భక్తుల గోవింద నామస్మరణలతో కోలాహలంగా స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం సముద్రం వద్ద పూజలు జరిపి స్వామివారికి చక్రస్నానం చేయించారు. రాత్రి స్వామి-అమ్మవార్లకు ప్రత్యేక పూజలుచేసి శ్రీపుష్పోత్సవం ఘనంగా నిర్వహించారు. పవళింపు సేవతో స్వామివారి కల్యాణోత్సవాలు ముగిశాయి. ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు

స్వామివారికి చక్రస్నానం

ముమ్మిడివరం, మే12(ఆంధ్రజ్యోతి): శ్రీఅనంతలక్ష్మి పద్మావతి సమేత వివేకా సత్యనారాయణస్వామివారి కల్యాణోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం స్వామివారికి చక్రస్నానం, సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంపైనా, జానకీ రామచంద్రస్వామివార్లను హనుమంత వాహనంపైనా, మహాలక్ష్మి అమ్మవారిని పూలరథంపైనా ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభమైన కల్యాణ మహోత్సవాలు ఐదు రోజులు వైభవోపేతంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఉడిమూడి మాజీ సర్పంచ్ మృతి

పి.గన్నవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉడిమూడి మాజీ సర్పంచ్ అడ్డాల వీరరాఘవ (56) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందినట్లు భర్త, మాజీ సొసైటీ సభ్యుడు రవీంద్రనాథ్‌ఠాగూర్ తెలిపారు. మాజీ సర్పంచ్ మృతిపై సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, ఎంపీటీసీలు ఆదిమూలం సూరయ్యకాపు, అయినపర్తి ప్రియదర్శిని, అడ్డగళ్ల వెంకటసాయిరాం, నల్లా పెద్దకాపు, కూటమి, వైసీపీ నాయకులు సంతాపం తెలిపారు.

ఘనంగా ఇటికాలమ్మ తీర్థం

అంబాజీపేట, మే 12(ఆంధ్రజ్యోతి): మాచవరం గ్రామదేవత శ్రీఇటికాలమ్మ అమ్మవారి తీర్థం సోమవారం ఘనంగా జరిగింది. ఆదివారం రాత్రి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన గరగనృత్యాలు, కోయిడ్యాన్సులు, సంగీత విభావరి అందర్ని అలరించాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తీర్థం సందర్భంగా అమ్మవార్ని పురవీధుల్లో ఊరేగించారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవార్ని పలువురు నేతలు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

సికిల్ సెల్ ఎనీమియా పట్ల అవగాహన ఉండాలి

మామిడికుదురు, మే 12(ఆంధ్రజ్యోతి): సికిల్ సెల్ ఎనీమియా పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పాశర్లపూడిలంక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సికిల్ సెల్ ఎనీమియాపై సోమవారం పాశర్లపూడిలంక, బి.దొడ్డవరం గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈవ్యాధి వంశ పారంపర్యంగా వస్తుందని, ఏమాత్రం అజాగ్రత్త చేయకూడదని వైద్య సిబ్బంది వివరించారు. ఈవ్యాధితో ప్రమాదం పొంచి ఉందని, ప్రతీ ఒక్కరూ దీని పట్ల అప్రమత్తంగా ఉండి వ్యాధి లక్షణాలు కనిపిస్తే వైద్య ఆరోగ్యశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించి వ్యాధి లక్షణాలను వివరించి ఆయా గ్రామాల్లోని ప్రజల్ని చైతన్య పరిచారు.

బుద్ధ జయంతి వేడుకలు

ముమ్మిడివరం, మే 12(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పోలమ్మ చెరువుగట్టున ఉన్న జైబుద్ధ పార్కులో వైశాఖ పౌర్ణమి బుద్ధ జయంతిని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి బుద్ధ విగ్రహం వద్ద పుష్పాలు అందించి త్రిపీటకాలు, పంచశీలను పఠించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మానవ మనుగడకు బౌద్ధమే శరణ్యమన్నారు. భారతదేశ ప్రతిష్ఠలు, గౌతమ బుద్ధుని జననం వల్ల ప్రపంచ దేశాల్లో శాంతి సందేశానికి చిహ్నంగా నిలిచాయన్నారు. వడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, కాశి బాబూ జగ్జీవన్‌రావు, దోనిపాటి ఆంజనేయులు, కాశి సిద్ధార్థకుమార్, కాశి సింహాద్రివర్య, బొజ్జా బాలకృష్ణ, దాసరి సత్యనారాయణ, కాశి అప్పారావు, ముదే వెంకట్రావు, కాశి రామచంద్రరావు, సబ్బతి సత్యనారాయణ పాల్గొన్నారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): యానాం అంబేడ్కర్‌నగర్ బుద్ధ పార్కులో ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా యానాం విభాగం ఆధ్వర్యంలో 2,569వ బుద్ధ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉపాసక కోరుకొండ నాగేశ్వరావు ఆధ్వర్యంలో బుద్ధ వందనం పంచశీల అష్టాధిమార్గం కార్యక్రమాన్ని నిర్వహించారు. బుద్ధుడు ప్రపంచ శాంతి దూత అన్నారు. ప్రపంచ దేశాలకు మార్గదర్శి బుద్ధ భగవాన్ అని క్షైమామణి పొనుగుమట్ల విష్ణుమూర్తి ఉద్ఘోదించారు. విశ్రాంత పరిపాలనాధికారి నామడి అప్పారావు, గిడ్డి బలరాం, సురేష్, భగవన్, హరి, శీనివాస్, శ్రీరాములు పాల్గొన్నారు.

22న బైక్ ర్యాలీ

అంబాజీపేట, మే 12(ఆంధ్రజ్యోతి): శ్రీహనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల22న నిర్వహించే విజయోత్సవ బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ప్రముఖులు కోరారు. గంగలకుర్రుఅగ్రహారంలో కరప్రతాలను పంపిణీ చేశారు. బజరంగ్‌దళ్ రాష్ట్ర ప్రముఖ్ శిరంగు నాయుడు మాట్లాడుతూ 22న అమలాపురం ఎస్‌కేబీఆర్ కాలేజ్ రోడ్డులో ఉన్న త్రిముఖ గణపతి ఆలయం సమీపంలో భారీ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసభకు శ్రీమారుతీ జీయర్‌దాస్, రాళ్ళపల్లి పాపయ్యశర్మ పాల్గొంటారన్నారు. బైక్ ర్యాలీలో హిందువులంతా పాల్గొని విజయంతం చేయాలని పిలుపునిచ్చారు.

పరశురామేశ్వరస్వామి సేవలో కలెక్టర్ దంపతులు



అమలాపురం టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి సమీపంలోని గుడిమల్లంలో శ్రీపరశురామేశ్వరస్వామి వారిని దర్శించుకుని స్వామివారి సేవలో ఉన్న కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్-నివేదిత దంపతులు. వీరికి ఆలయ మాజీ ఛైర్మన్ బర్తలగిరి నాయుడు, ఈవోలు స్వామివారి ఆశీర్వచనం వేదపండితులచే అందించారు.

సహజకవి వెంకట్‌కు జాతీయ అవార్డు

అంబాజీపేట, మే12(ఆంధ్రజ్యోతి):మాచవరానికి చెందిన సహజకవి పొలమూరి వెంకట్‌కు జాతీయ అవార్డు లభించింది. ఏలూరు మహాలక్ష్మి గోపాలస్వామి కల్యాణ మండపంలో కళావేదిక సంస్థ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు, పట్టాభిషేక మహోత్సవం జరిగింది. సహజకవి వెంకట్‌కు జాతీయ అవార్డును అందజేశారు. గజల్ శ్రీనివాస్, జి.ఈశ్వరి, భూషణం పార్థసారధి, సతీష్‌పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీగణపతి సుదర్శన హోమం


బందారులంకలో హోమాలు నిర్వహిస్తున్న దంపతులు

అమలాపురం రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండలం బందారులంకలోని బిళ్లవారి వీధిలో శ్రీపద్మావతి అలివేలుమంగా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి తీర్థ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష్మీగణపతి సుదర్శన హోమం, పూర్ణాహుతి ఘనంగా జరిగాయి. ప్రత్యేకంగా తయారుచేసిన హోమగుండాల్లో 11మంది దంపతులు కారుపర్తి మల్లేశ్వరావు శిష్యబృందం అర్చకత్వంలో హోమ క్రతువు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీటీసీ ఎ.హిమభారతి, ఉప్పుగంటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అమ్మవార్లకు సుగంధ భరిత పుష్పాలు, వివిధ రకాల స్వీట్లతో ప్రత్యేకంగా అలంకరించిన పాన్పు, స్వామి-అమ్మవార్ల పవళింపుసేవను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస బాలమిత్ర సంఘం ప్రతినిధులు, స్థానిక గ్రామపెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజనపై శిక్షణ

అల్లవరం, మే 12(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన పథకం కింద ఎంపికైన గోడిలంక, యెంట్రుకోన, దేవగుప్తం, గూడాల గ్రామసెక్రటరీలు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈపథకం ద్వారా గ్రామానికి రూ.20లక్షల కేంద్రం నిధులు మంజూరు చేస్తుందని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. ఆ నిధులతో షెడ్యూల్డు కులాలు నివశించే ప్రాంతాల్లో అంగన్‌వాడీ భవనాలు, డ్రైన్లు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా మెరుగుదలకు పంచాయతీ తీర్మానాలతో పనులు చేయించుకోవచ్చునన్నారు.

పెరిపే నియామకంపై హర్షం

అంబాజీపేట, మే 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా పెరిపే ఈశ్వర్‌ను నియమించడం పట్ల కోనసీమ శాలివాహన సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈశ్వర్‌ను నియమించడం పట్ల కూటమి ప్రభుత్వానికి జిల్లా అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మం, సెక్రటరీ దాలపర్తి భీమేశ్వరరావు, సఖినేటిపల్లి పెద్దిరాజు, దొడ్డిపట్ల శ్రీనివాస్, ఆదుర్తి నారాయణమూర్తి, మంతెన శ్రీను, ర్యాలి శ్రీనివాసవడయార్, తదితరులు అభినందనలు తెలిపారు.

ఘనంగా నర్సుల దినోత్సవం


వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నర్సులను ఘనంగా సన్మానిస్తున్న దృశ్యం

అమలాపురంటౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): మెడ్ యునైటెడ్ ఆసుపత్రిలో ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ అప్పట్లో ఎంతో మందికి సేవచేసేందుకు నర్సు వృత్తిని ఎన్నుకుని ఆమె చేసిన కృషిని ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రశంసించారు. ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, వాకర్స్‌క్లబ్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, కోశాధికారి పడాల నాయుడు, గోటేటి గంగాధర్, పచ్చిగోళ్ల రాజా, నూకల సత్యనారాయణ, కామేశ్వరరావు, వలవల వెంకటరెడ్డినాయుడు, గుర్రం రామకృష్ణ, చింతలపూడి బాబ్జి, కుడుపూడి త్రినాథ్, పట్నాల రమణ, వై.అనంతలక్ష్మి పాల్గొని మహిళలను సన్మానించి పండ్లను అందించారు.

నర్సుల సేవలు అభినందనీయం


నర్సులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, మే12(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులను హక్కున చేర్చుకుని సేవలందిస్తూ మాతృమూర్తిలా మెలగడం అభినందనీ యమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నర్సులను ఆయన సన్మానించారు. నర్సులు రోగికి ఓదార్పు, ధైర్యాన్ని ఇచ్చి సగం జబ్బును నయం చేస్తారన్నారు. అనంతరం పి.గన్నవరం సీహెచ్‌సీ వైద్యాధికారి యు.రాఘవేంద్రరావుతో పాటు నర్సులను దుశ్శాలువాలతోసన్మానించి పండ్లు అందించారు. నర్సులు ఎమ్మెల్యేను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, ఎంపీటీసీ పులపర్తి వెంకటలక్ష్మి, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, శేరు శ్రీనుబాబు, కుంపట్ల నాయుడు, యడ్ల ఏసు, నిమ్మకాయల శేషయ్య, ఆసుపత్రి సిబ్బంది చవటపల్లి మణితేజ తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గలక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకం

కాట్రేనికోన, మే 12(ఆంధ్రజ్యోతి): శ్రీవిజయదుర్గలక్ష్మీ అమ్మవారి ఆలయంలో సోమవారం ఉదయం పంచామృతాభిషేకం జరిగింది. కార్యక్రమంలో గెద్దనపల్లి గ్రామస్తులు గోపాలకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. ఆకొండి శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది.

ఘనంగా శివకేశవులకు చక్రస్నానం

అంబాజీపేట, మే 12(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు అగ్రహారం కౌశిక నదీ తీరాన వేంచేసియున్న శ్రీఉమాపార్వతీ సమేత వీరేశ్వరస్వామి, శ్రీభూదేవి, శ్రీదేవి సమేత కేశవస్వామి వార్ల కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివార్ల చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చంద్రమౌళి సూర్యకామేష్, సుదర్శనం కేశవాచార్యుల ఆధ్వర్యంలో గొర్తి పల్లయ్య పంతులు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెం శ్రీభూసమేత శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవంలో భాగంగా స్వామివారి చక్రస్నానం ఘనంగా నిర్వహించారు.

ఘనంగా గ్రామదేవతల జాతర



అల్లవరం టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): అల్లవరం గ్రామ దేవతలు చింతాలమ్మ, రాజ్యలక్ష్మి అమ్మవార్ల జాతర మహోత్సవం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. బాణసంచా కాల్పుల నడుమ గరగ నృత్యాలు, శక్తివేషాలు, తీన్మార్ డప్పు వాయిద్యాలతో అమ్మవారి జాతర ఉత్సవం జరిగింది. యువకులు రెట్టించిన ఉత్సాహంతో జాతర ఉత్సవంలో పాల్గొని నృత్యాలు చేశారు. మంగళవారం చింతాలమ్మ, రాజ్యలక్ష్మి అమ్మవార్ల తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

సేంద్రియ వ్యవసాయ పంటలతో మంచి ఆరోగ్యం

మామిడికుదురు, మే 12(ఆంధ్రజ్యోతి): సేంద్రీయ వ్యవసాయం ద్వారా పండించిన పంటలతో మంచి ఆరోగ్యం కలుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎ.మృదుల అన్నారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏవో పరిశీలించారు. ప్రస్తుత జీవన విధానంలో ప్రకృతి వ్యవసాయమే అత్యంత శ్రేయస్కరమని, సేంద్రీయ వ్యవసాయ పంటలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందన్నారు. ప్రజలు, రైతుల్లో చైతన్యం తీసుకువచ్చి ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్లేలా ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. చెల్లుబోయిన రాధా, కుసుమ పద్మావతి, కుడుపూడి జానకి, గోగి లెనిన్ పాల్గొన్నారు.

మండపేట




ప్రత్యేక అలంకరణలో చింతాలమ్మ అమ్మవారు. పక్క చిత్రంలో ఆలయం వద్ద ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

పసలపూడిలో ఘనంగా చింతాలమ్మ తీర్థం

రాయవరం, మే 12(ఆంధ్రజ్యోతి): పసలపూడి గ్రామంలో పెద్ద చింతాలమ్మ, చిన్న చింతాలమ్మ, పోతురాజుస్వామి తీర్థాన్ని సోమవారం నిర్వహించారు. ఆదివారం రాత్రి జాతరను పురస్కరించుని అమ్మవారి ఆల యాన్ని అందంగా తీర్చిదిద్దారు. అమ్మవారి ప్రతిరూపాలైన గరగలకు గ్రామంలో గ్రామోత్సవం జరిపారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఉత్సవ కమిటీ అధ్య క్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఆలయం వద్ద సత్కరించారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన గరగ నృత్యాలు, కోలాటం, శక్తి వేషాలు, తీన్‌మార్ వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తీర్థాన్ని పురస్కరించుకుని భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, నైవేద్యం, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో రామచంద్రపురం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు నల్లమిల్లి సూర్రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎస్.వెంకన్నబాబు, నల్లమిల్లి సతీష్ రెడ్డి, కె.వేణుగోపాలరెడ్డి తదితరులు ఉన్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.42 లక్షలు



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తులు


ఆత్రేయపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తజనం అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,42,718 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి అనకాపల్లికి చెందిన అడ్డగళ్ళ శ్రీనివాసరావు, కనకమహాలక్ష్మి దంపతులు రూ.1,00,008, పెనుగొండకు చెందిన డాక్టర్ ఆశు సత్య రూ.30,116 విరాళం ఇచ్చారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.



పామర్రులో గారడీ నృత్యాలు చేస్తున్న దృశ్యం

వైభవంగా కుంతీదేవి జాతర

కె.గంగవరం, మే12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పామర్రు గ్రామంలో సోమవారం కుంతీదేవి జాతరను వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా కుంతీదేవి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. అమ్మవారికి పలువురు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గారడీల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. చేశారు. పామర్రు పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు వాటిని ఆసక్తిగా తిలకించారు.




ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ అమ్మవారు. పక్క చిత్రంలో పీఠంలో పౌర్ణమి సందర్భంగా కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పీఠంలో వైభవంగా వైశాఖ పౌర్ణమి పూజలు

రాయవరం, మే 12(ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠంలో సోమవారం వైశాఖ పౌర్ణమి పూజలను వైభవంగా నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని విజయదుర్గ అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు జరిపి ప్రత్యేక అలంకరణ చేశారు. తొలుత విజయ వేంకటేశ్వరస్వామికి సుప్రభాత సేవ, తులసిదళ అర్చనలు చేశారు. అనంతరం విజయదుర్గ అమ్మవారికి లలితా అష్టోత్తర, సహస్ర నామాలు, దుర్గాత్రిశతి, ద్వాత్రింశ నామావళి, లక్ష్మి, సరస్వతి, దుర్గ అష్టోత్తరాలతో కుంకుమ పూజలు, భవాని శంకర సమేత అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గ సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్య వెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ , బుజ్జి, పీఆర్వో బాబి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఎంపీడీవో రత్నకుమారికి సన్మానం

కపిలేశ్వరపురం, మే 12(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా పనిచేస్తున్న కె.రత్నకుమారి విజిలెన్స్ జిల్లా అధికారిగా పదోన్నతిపై డ్వామా రాజమహేంద్రవరానికి బదిలీ అయ్యారు. సోమవారం ఆమె రిలీవ్ కావడంతో మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి జి. రాజేంద్ర ప్రసాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. పదోన్నతిపై వెళుతున్న ఆమెను తహసీల్దార్ చిన్నారావు, ఎంఈవో తాతారావు, వ్యవసాయాధికారి రమేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వీరభద్రరాజు, డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ తదితరులతో పాటు, కార్యాలయ సిబ్బంది, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు.



రత్నకుమారిని సన్మానిస్తున్న మండల పరిషత్ ఉద్యోగులు తదితరులు

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

ఆత్రేయపురం, మే 12(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో 13వ రోజు సోమవారం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇంగ్లీష్, తెలుగు కథలపై విశ్రాంత ఉపాధ్యాయుడు కె.రత్నరాజు తెలిపారు. జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన పలు అంశాలను గ్రంథాలయాధికారి నమ్మశివాయ వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిరక్షణలో నిరంతరం శ్రమిస్తున్న నర్సుల సేవలు వెలకట్టలేనివని ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ ప్రవీణ్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో నర్సులను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో డాక్టర్ చక్రధర్, నర్సింగ్ సూపరింటెండెంట్ జయప్రద, ఏరియా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు రాఘవరావుకు సన్మానం

మండపేట, మే 22(ఆంధ్రజ్యోతి): మండపేటకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు నక్కిన వీరరాఘవరావును ఏలూరుకు చెందిన శ్రీశ్రీకళావేదిక నిర్వాహకులు ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో సత్కరించారు. తెలుగుభాషకు ఆయన సేవలను నిర్వాహకులు ప్రశంసించి ప్రశంసాపత్రం, భాష సేవా పురస్కారం అందజేశారు. శని, ఆదివారాలు జరిగిన కార్యక్రమంలో తాను పాల్గొన్నానని ఆయన చెప్పారు.



వానపల్లి పల్లాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

నేడు వానపల్లి పల్లాలమ్మ తీర్థం

కొత్తపేట, మే 12(ఆంధ్రజ్యోతి): వానపల్లి పల్లాలమ్మ తీర్థానికి దేవదాయశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సోమవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారి తీర్థం మంగళవారం మొదలై నెల రోజులపాటు కొనసాగుతుంది. ఉభయ గోదావరి జిల్లాల నుంచి అమ్మవారి తీర్థానికి భక్తుల రాక నేపథ్యంలో దేవదాయశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. సోమవారం రాత్రి పెద్ద జాగరం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్టు తెలిపారు.



ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్

ఆలింకో సంస్థ సేవలు అభినందనీయం

కార్మికశాఖా మంత్రి సుభాష్

ద్రాక్షారామ మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ఆలింకో సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం రామచంద్రపురం రూరల్ మండలంలోని ఎమ్‌పీడీవో కార్యాలయంలో జరిగిన ఉపకరణాల పంపిణీలో మంత్రి పాల్గొని వాటిని పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని రామచంద్రపురం, కె. గంగవరం మండలాల్లో భవిత కేంద్రాలలో విద్యనభ్యసిస్తున్న 46 మంది చిన్నారులకు వీల్ ఛైర్లు, ఎలక్ట్రికల్ మోపెడ్లు, బ్రెయిలీ కిట్లు వినికిడి పరికరాలను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీడీవో పద్మజ్యోతి, ఎంఈవోలు వీరరాఘవరెడ్డి, నాగరాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలి సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా స్వామివార్ల చక్రస్నానం

ఆత్రేయపురం, మే 12(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఉపాలయంలో ఉన్న రమాసత్యనారాయణస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం పూర్ణాహుతి, చక్రస్నానం, అర్చన, తులసీ పూజ, అమ్మవారికి కుంకుమార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన, పూర్ణాహుతి, త్రిశూల స్నానం, నిర్వహించారు. రాత్రి పుష్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సారా కేసులో పట్టుబడిన వారిని బైండోవర్ చేస్తూ తహశీల్దారు వద్ద హాజరుపరిచిన దృశ్యం

సారా విక్రయిస్తున్న వారిపై బైండోవర్ కేసులు

ఆత్రేయపురం, మే 12(ఆంధ్రజ్యోతి): రాజవరం గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ కె.అన్నవరం తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సోమవారం రాజవరంలో సారా విక్రయిస్తూ పట్టుబడిన 11 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. వారిని తహశీల్దారు కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొనసాగుతున్న శ్రీవాణి శాంతిదీక్ష

మండపేట, మే 12(ఆంధ్రజ్యోతి): కేశవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు గోడ నిర్మించే వరకు తన శాంతియుత దీక్ష కొనసాగిస్తానని గ్రామానికి చెందిన వల్లూరి శ్రీవాణి తెలిపారు. ఆమె చేస్తున్న శాంతియుత దీక్ష సోమవారం 25వ రోజుకు చేరింది. పాఠశాలకు గోడలేకపోవటం వల్ల ఆక్రమణలకు గురైందన్నారు. ఆక్రమణలు తొలగించి తక్షణమే గోడ నిర్మించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామంలో వున్న ప్రైవేటు సంస్థ గోడ నిర్మించేందుకు నిధులు ఇవ్వగా పలువురు నేతలు అడ్డుతగులుతున్నారని ఆమె ఆరోపించారు. తాను మాత్రం ప్రహరీ నిర్మించే వరకు శాంతియుతదీక్ష పోరాటం సాగిస్తానని తెలిపారు. తక్షణమే గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

రావులపాలెం, మే 12(ఆంధ్రజ్యోతి): రావులపాలెం గ్రామదేవత ఆకులమ్మ అమ్మవారి తీర్థం సోమవారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని ఆలయ కమిటీ సభ్యులు సుందరంగా తీర్చిదిద్దారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

ఆసుపత్రులకు డాక్టర్ల నియామకం

• ఆలమూరు సీహెచ్‌సీకి ముగ్గురు • చొప్పెల్ల పీహెచ్‌సీకి ఇద్దరు

ఆలమూరు, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించి పేదలకు అవి అందుబాటులో ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఆలమూరు మండలానికి ఐదుగురు వైద్యులను నియమించారు. ఆలమూరు సీహెచ్‌సీలో గైనకాలజిస్టుగా కె.స్వర్ణలత, జనరల్ మెడిషన్ విభాగంలో కె.సుష్మిత, జనరల్ సర్జన్ విభాగంలో సీహెచ్ ప్రసన్నలను నియమిస్తూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైద్య విధాన పరిషత్ ఉత్తర్వులు జారీ చేసింది. ఆసుపత్రిలో ఎనిమిది మంది వైద్యులు వైద్య సేవలందించాల్సి పిడియాట్రిక్ పోస్టు మాత్రమే ఖాళీ ఉందని మిగిలిన పోస్టు భర్తీ అయినట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.గోపిరామ్ తెలిపారు. చొప్పెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు పీజీ విద్య నిమిత్తం వెళ్లిన వారి స్థానంలో ఎస్.లక్ష్మిస్నేహ, బి.అనంతరామకృష్ణలను నియమించారు.

ఎమ్మెల్యే బండారుకు అభినందనలు

ఆలమూరు మండలంలోని ఆసుపత్రుల్లో వైద్యుల కొరత కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు ఇటీవల కూటమి నాయకులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యే ఆరోగ్యమంత్రితో పాటు పలువురు ఉన్నతాధికారులతో చర్చించారు. మండలానికి ఐదుగురు వైద్యులను నియమించారని ముఖ్యంగా ఆలమూరు సీహెచ్‌సీలో గైనకాలజిస్టును నియమించడం వల్ల మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కూటమి నాయకులు అన్నారు. వైద్యులను నియమించడంతో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేసిన కృషిని పలువురు అభినందించారు.



ఆలమూరులో సీహెచ్‌సీ ఆసుపత్రి

ఘనంగా గంటాలమ్మ వార్షికోత్సవం

ఆత్రేయపురం, మే 12(ఆంధ్రజ్యోతి): నార్కెడిమిల్లి గ్రామదేవత గంటాలమ్మ అమ్మవారి వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, అన్నసమారాధనలు జరిపారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అమ్మవారిని దర్శించుకున్నారు. విశాఖకు చెందిన పులవర్తి రమేష్, స్వాతి దంపతులు రూ.లక్షతో అమ్మవారి ఫొటో ఫ్రేమ్‌లు చేయించగా దాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మద్దింశెట్టి వీరవెంకట సత్యనారాయణ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ కరుటూరి నరసింహారావు, లొల్ల సర్పంచ్ కాయల జగన్నాధం, ఎస్‌ఐ రాము, తూము గణేష్, తదితరులు పాల్గొన్నారు.



గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై కొత్తపేట ఆర్డీవోతో కలిసి సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బండారు

రానున్న పుష్కరాలకు ఘాట్లను తీర్చిదిద్దాలి

కొత్తపేట, మే 12(ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు పుష్కర ఘాట్లను సుందరీకరించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. రానున్న పుష్కరాలకు సంబంధించి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ అధ్యక్షతన జరిగిన సమీక్షలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు పాల్గొని మాట్లాడారు. దేశంలోనే కాకుండా విదేశాల నుంచి సైతం భక్తులు గోదావరి పుష్కరాలకు రానున్న నేపథ్యంలో వాటి ఏర్పాట్లపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రసిద్ధి చెందిన దేవాలయాలను భక్తులు సందర్శించేందుకు వీలుగా మార్గాలు, రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో ఆర్డీవో పి.శ్రీకర్, ఎంపీడీవో ఎం.నరేష్‌కుమార్, తహశీల్దారు వై.రాంబాబు, పంచాయతీరాజ్, దేవదాయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి చేరికలు



మెర్లపాలెంలో జనసేనలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పుతున్న ఇన్‌చార్జ్ శ్రీనివాస్

ఆత్రేయపురం, మే 12(ఆంధ్రజ్యోతి): మెర్లపాలెం గ్రామానికి చెందిన ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 50 మంది నాయకులు, కార్యకర్తలు వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరారు. సోమవారం రాత్రి జనసేన కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ వారికి పార్టీ కండువాలను కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో చేకూరి కృష్ణంరాజు, రంకిరెడ్డి వినయ్ కుమార్, ఎంపీటీసీ వీరబాబు, రంకిరెడ్డి ఆశోక్‌కుమార్, పార్టీ గ్రామ అధ్యక్షులు, ఎం. రామాంజనేయులు, ఉపాధ్యక్షులు సన్నపు కిరణ్‌కుమార్, బి.బాబి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఒప్పంద కార్మికుల సమ్మె

మండపేట, మే 12(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో ఒప్పంద వేతనంపై పనిచేస్తున్న కార్మికుల సమ్మె సోమవారం 6వ రోజుకు చేరింది. బూరుగుంట చెరువు వద్ద వారు నిరసన తెలిపారు. సంఘ అధ్యక్షుడు సుబ్బరాజు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, 15 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఒప్పంద కార్మికులు టేకి వెంకన్న, కప్పల సురేంద్ర, యాదల తాతారావు, గంధం మధు, గంటి నవీన్ కుమార్, వేంకటేశ్వర్లు, తలాటి వెంకన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ పార్కు వద్ద ఆందోళన చేస్తున్న ఇంజనీరింగ్ ఒప్పంద కార్మికులు

సరస్వతి నదీ పుష్కరాలకు ఆర్టీసీ బస్సులు



రావులపాలెం ఆర్టీసీ జీఎం జీజీవీ రమణ

రావులపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి): రావులపాలెం డిపో నుంచి సరస్వతి నదీ పుష్కరాలకు రెండు సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ జీజీవీ రమణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న రావులపాలెం డిపో నుంచి ఆర్టీసీ బస్సులు బయలుదేరి వరంగల్, వేములవాడ, కొండమ్మగుట్ట, ధర్మపురి, కాళేశ్వరం, రామప్పదేవాలయ దర్శనాల అనంతరం సరస్వతి నదీ పుష్కరస్నానం చేయించి తిరిగి డిపోకు చేరుతాయన్నారు. ప్రయాణికుల నుంచి వస్తున్న స్పందన కారణంగా ఈ నెల 20న మరో రెండు బస్సులు సిద్ధం చేసినట్లు తెలిపారు. టిక్కెట్ల ధర రూ.2200 నిర్ణయించామన్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో విహార, తీర్థయాత్రకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వివరాలకు మేనేజర్ సెల్ 99592 25537, అసిస్టెంట్ మేనేజర్ 73829 11871లో సంప్రదించాలన్నారు.

ఘనంగా స్వామివారి త్రిశూల స్నానం, గ్రామోత్సవం

కపిలేశ్వరపురం, మే 12 (ఆంధ్రజ్యోతి) : కపిలేశ్వరపురం ఏటిగట్టు సమీపంలోనున్న దుర్గామాత సమేత పార్వతి పాపవినాశేశ్వర స్వామి, శ్రీపార్వతి మాత సమేత అగస్త్యేశ్వరస్వామివార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివార్ల త్రిశూలస్నానం, గ్రామోత్సవం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు కాలధరి ఉమామహేశ్వరావు, కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో స్వామివార్లకు అభిషేకాలు, పూజలు జరిపారు. గౌతమి గోదావరి నదిలో స్వామివార్ల త్రిశూలస్నానం, వేదమంత్రోశ్చరణల మధ్య జరిపారు. పూర్ణాహుతి, స్వామివార్ల గ్రామోత్సవం, ధ్వజావరోహణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామోత్సవం సందర్భంగా భక్తుల నుంచి నైవేద్యాలు స్వీకరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దాహార్తి తొలగించేందుకు చలివేంద్రాలు దోహదం

రావులపాలెం, మే 12(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదపడతాయని వక్తలన్నారు. రావులపాలెం తహశీల్దారు కార్యాలయం వద్ద రిటైర్డ్ తహశీల్దారు కొప్పిశెట్టి దుర్గారావు తన కుమారుడు శ్రీకాంత్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితరులు ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



తహశీల్దారు కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

రాష్ట్రాభివృద్ధిని చూడలేక వైసీపీ అసత్య ప్రచారం

మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అభివృద్ధిని చూడలేక వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి సుభాష్ విమర్శించారు. అమలాపురంలో మహిళల కుట్టుమిషను శిక్షణ ఏర్పాటుపై రాష్ట్రంలో 170 కోట్లు దోచుకునేందుకని కొంతమంది వైసీపీ నాయకుల ఆరోపణలను మంత్రి ఖండించారు. రాష్ట్రాన్ని వైసీపీ ఏవిధంగా దివాళా తీయించిందో ప్రజలకు తెలుసన్నారు. నిరాధార ఆరోపణలు చేస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు. కుట్టుమిషన్ల శిక్షణలో నిధులు దుర్వినియోగం అయినట్లు ఆధారాలు ఉంటే రుజువు చేయాలన్నారు.

వనుములమ్మకు ప్రత్యేక పూజలు

కె.గంగవరం, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవాడ గ్రామంలోనున్న వనుములమ్మ జాతరను ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. జాతర సందర్భంగా జరిపిన సాంస్కృతిక కార్యక్రమాలు, గరగ నృత్యాలు, బుట్టబొమ్మలు, బ్యాండువాయిద్యాలు వంటివి ఏర్పాటు చేశారు. సోమవారం తీర్థం జరగ్గా, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.



ప్రత్యేక అలంకరణలో ఉన్న బంగారమ్మతల్లి

ఘనంగా బంగారమ్మతల్లి తీర్థం

కొత్తపేట, మే 12(ఆంధ్రజ్యోతి): కొత్తపేట గ్రామదేవత బంగారమ్మతల్లి తీర్థాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి పెద్ద జాగరం భక్తిశ్రద్ధలతో జరిపారు. తీర్థాన్ని పురస్కరించుకుని పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామదేవతకు భక్తజనం నైవేద్యాలు, మొక్కుబడులు చెల్లించారు.

లీలాకృష్ణకు పదవిపై హర్షం

మండపేట, మే 12(ఆంధ్రజ్యోతి) మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జీ వేగుళ్ల లీలాకృష్ణకు ఏపీఎస్‌ఐడీసీ ఛైర్మన్ పదవి రావటంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. పార్టీలో కష్టపడి పనిచేసే లీలాకృష్ణకు సముచిత స్థానం దక్కిందని మండపేట మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవప్రకాష్ అన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనా సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



ప్రభుత్వ హాస్టల్‌లో దోమలు మందు పిచికారి చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ హాస్టల్‌లో దోమల మందు పిచికారి

రావులపాలెం, మే 12(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ హాస్టల్‌లో మలేరియా జిల్లా అధికారి నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పర్యవేక్షణలో దోమల మందు పిచికారి చేయించారు. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు ముందస్తు చర్యలలో భాగంగా దోమల మందు పిచికారి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌కే హసీనా, ఎస్.రాజాబాబు, సీహెచ్ వెంకటేశ్వరరావు, కె.శ్యాముల్‌రాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.